



epaper. aksharakalam. com

# అక్షర కలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

AK NEWS 24X7

సంపుటి : 19 సంచిక : 167 | 11-09-2026 శుక్రవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00


# గల్వాన్ తర్వాత తొలిసారి..



## మోదీ-జిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

## సెప్టెంబర్ 12, 13న ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు

## మోదీ-జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీకి అవకాశం

## 2020 గల్వాన్ తర్వాత ఇదే తొలి ముఖాముఖి చర్చ

## అజిత్ దోవల్ ఇటీవల చైనాలో చర్చలు

## సరిహద్దు, వాణిజ్యం, భద్రతపై చర్చకు అవకాశం

ఐదేళ్లుగా దూరంగా ఉన్న భారత్-చైనా సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశముంది. అదే జరిగితే 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఇద్దరు నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే తొలిసారి అవుతుంది. జిన్‌పింగ్ శనివారం భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెట్టనున్నారు. ఇటీవల కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ ఒకే వేదికపై కనిపించి కరచాలనం చేసుకున్నారు. అయితే అప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఇప్పుడు బ్రిక్స్ వేదికగా భేటీ జరిగితే ఇరుదేశాల సంబంధాలపై దాని ప్రభావం కీలకంగా ఉండొచ్చు.

సరిహద్దు నుంచి వాణిజ్యం వరకు..

జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. సరిహద్దు వ్యవహారాలపై డబ్ల్యూఎంసీసీ సమావేశం తర్వాత ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. తాజా భేటీలో సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, ఎల్ఏసీ వద్ద ఉద్రిక్తతలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

అరుణాచల్ ప్రదేశ్.. మరో కీలక అంశం

లడఖ్‌లో ఉద్రిక్తతలు తగ్గినా సరిహద్దు వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగమని చైనా చెబుతుండగా.. భారత్ దాన్ని పూర్తిగా తిరస్కరిస్తోంది. ఇటీవల అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలో చైనా సైనిక కదలికలపై వచ్చిన నివేదికలు కూడా ఆందోళన పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ-జిన్‌పింగ్ భేటీ జరిగితే సరిహద్దులో శాంతి, స్థిరత్వంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసే అవకాశం ఉంది. అమెరికా సుంకాలు, పశ్చిమాసియాలో అస్థిరత నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నదీ చర్చకు రావచ్చు.





## కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.



### ఆస్తి కోసం కొడుకు చేసిన

## కుట్రలకు సుప్రీంకోర్టు చెక్.. తల్లి కాళ్లు పట్టుకోమని ఆదేశం..

ఓ వ్యక్తి మోసపూరితంగా తల్లిదండ్రుల ఆస్తిని తన సొంతం చేసుకోవాలని అనుకున్నాడు. ఇందుకోసం నకిలీ పత్రాలను తయారు చేశాడు. ఆస్తి తనదేనంటూ సుప్రీంకోర్టుకు వెళ్లాడు. తల్లిదండ్రులను మోసం చేయాలని భావించిన అతడికి సుప్రీంకోర్టు ఊహించని షాక్ ఇచ్చింది. పిటిషన్‌ను కొట్టివేయడమే కాకుండా.. తల్లి పాదాలు తాకి క్షమాపణ కోరమని అతడిని ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన ఓ వృద్ధ జంట ఎంతో కష్టపడి బిల్డింగ్ కట్టుకుంది. ఆ బిల్డింగ్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లో ఆ దంపతుల కొడుకు, కోడలు ఉంటున్నారు. ఆ బిల్డింగ్ మొత్తాన్ని సొంతం చేసుకోవాలని వృద్ధ దంపతుల కుమారుడికి బుద్ధి పుట్టింది.

2



### ఏఐ ఫేక్ వీడియోలతో మోసాలు..

## ప్రజలకు ప్రియాంక గాంధీ ఆఫీస్ హెచ్చరిక..

సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఏఐ ఫేక్ వీడియోలను నమ్మి మోసపోవద్దని ఆమె ఆఫీస్ ప్రజలను హెచ్చరించింది. సైబర్ నేరగాళ్లు ప్రియాంక గాంధీ వాయిస్, ముఖంతో ఏఐ వీడియోలు సృష్టిస్తున్నారని పేర్కొంది.

### ఉద్యోగులు, పెన్షనర్లకు

## మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం



2

ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వారు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. జులై 17 నుంచి నూతన ఈహెచ్ఎస్ సదుపాయం అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈహెచ్ఎస్ పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు.



2

## శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

### మంత్రి తుమ్మలపై బీజేపీ

## ఎమ్మెల్యేల ప్రశంసలు



2

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, రాకేష్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. మంత్రిగా తుమ్మల చాలా బాగా పనిచేస్తున్నారని.. తాము ఇలాంటి మంత్రిని చూడలేదని పేర్కొన్నారు. ఎప్పుడైనా ఫోన్ చేసినా తుమ్మల స్పందిస్తారని.. ఆదివారం రోజున కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. పనిలో ఉన్న సమయంలో ఫోన్ ఎత్తలేకపోయినా తిరిగి కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు.

## ఆర్టీసీని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం: మంత్రి పొన్నం



2

ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్ లైన్ లాంటిదని తెలంగాణ రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభివర్ణించారు. గురువారం అసెంబ్లీలో ఆర్టీసీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లో మినీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని చూస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 540 ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నాయని వివరించారు.

## కనీస వేతనాలు చెల్లించడంలో దేశానికి తెలంగాణ ఆదర్శం: మంత్రి వివేక్

హైదరాబాద్,

కనీస వేతనాలు చెల్లించడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు. సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చెప్పారు. గురువారం తెలంగాణ అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. అయితే ఇప్పటికే ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలపై ప్రభుత్వం కమిటీ వేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నదీమ్ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. అందుకోసం త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి వివేక్ వెంకట స్వామి ప్రకటించారు.



# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై అసెంబ్లీలో చర్చ..

## ప్లాంట్ల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## అధిక వ్యయం ప్రధాన సవాల్‌గా మారింది

## కేంద్రం నిబంధనలు సడలిస్తే మరింత పెట్టుబడులు

## పారిశ్రామిక వృద్ధితో భారీగా డిమాండ్

## ఆయా గ్రామాల్లో మైక్రో గ్రిడ్‌ల ఏర్పాటుకు కసరత్తు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి

తెలంగాణలో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రిజర్వాయర్లపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం సహా పలు రిజర్వాయర్లను పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సభ్యులు సోలార్ పవర్‌పై ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి వివరణ ఇస్తూ కీలక విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. అయితే, దీనికి అధిక వ్యయం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల కారణంగా ఒక్క మెగావాట్‌కు రూ.1.30 కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. కేంద్రం నిబంధనలు సడలిస్తే పెట్టుబడులు మరింత పెరుగుతాయని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందని.. పారిశ్రామిక వృద్ధితో డిమాండ్ భారీగా పెరుగుతోందన్నారు. మరోవైపు, విద్యుత్ సబ్సిడీల కోసం ఏటా రూ.19 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అలాగే, సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపైనా కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి పేర్కొన్నారు. ఈ మేరకు అమ్రాబాద్‌లో 80 గ్రామాల సోలరైజేషన్‌కు పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో మైక్రో గ్రిడ్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇందుకోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులు, ప్రజలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. అలాగే, సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యేలకు భట్టి విక్రమార్క సూచించారు.

# బ్రిక్స్ సదస్సు కోసం జిన్‌పింగ్ భారత్‌కు వస్తారా.. ఇప్పటికీ క్లారిటీ లేదంటున్న చైనా..

ఇంటర్నెట్ డెస్క్:

బ్రిక్స్ సదస్సు ప్రారంభానికి ఇంకా 48 గంటల కంటే తక్కువ సమయమే ఉంది. అయినప్పటికీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్ పర్యటనపై ఇంకా స్పష్టత రాలేదు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. అయితే జిన్‌పింగ్ భారత్‌కు వస్తారా? వస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక భేటీ ఉంటుందా? అనే అంశాలపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. చైనా విదేశాంగ శాఖను జిన్‌పింగ్ పర్యటన గురించి ప్రశ్నించగా.. తమ వద్ద ఆయన పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం లేదని తెలిపింది. జిన్‌పింగ్ భారత్‌కు వస్తే.. ఏడు సంవత్సరాల తర్వాత ఆయన భారత పర్యటన చేసినట్లవుతుంది. జిన్‌పింగ్ భారత్ పర్యటన ఖరారైతే అందరి దృష్టి ప్రధానంగా మోదీ-జిన్‌పింగ్ ద్వైపాక్షిక సమావేశంపైనే ఉంటుంది. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సరిహద్దులో ఉద్రిక్తతలు, పరస్పర అనుమానాలు రెండు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక సంబంధాలపై ప్రభావం చూపాయి. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య సంబంధాలను క్రమంగా మెరుగుపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్ కూడా చైనా ఉత్పత్తులపై 2020లో విధించిన కొన్ని ఆంక్షలను సడలించింది. రెండు దేశాల మధ్య రాజకీయ విభేదాలు కొనసాగుతున్నప్పటికీ వాణిజ్య సంబంధాలు మాత్రం బలంగానే ఉన్నాయి. గత ఏడాది భారత్-చైనా ద్వైపాక్షిక వాణిజ్యం 12.4 శాతం పెరిగి 155 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరింది. పదేళ్ల క్రితం నమోదైన 71.6 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ. ఈ ఏడాది ఇప్పటివరకు ఇరు దేశాల మధ్య వాణిజ్యం రికార్డు స్థాయిలో జరిగింది. భారత్-చైనా సంబంధాలపై బీజింగ్ నుంచి వచ్చిన తాజా వ్యాఖ్యలు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి . ఇరు దేశాలు పోటీదారులు కాదని, భాగస్వాములని పేర్కొంది. ఒకరి అభివృద్ధికి మరొకరు అవకాశాలు కల్పించుకుంటూ ముందుకు సాగాలని జిన్‌పింగ్, మోదీ భావిస్తున్నట్లు చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. అయితే ఈ వ్యాఖ్యలకు అనుగుణంగా వాస్తవ సంబంధాలు ఎంతవరకు ముందుకు వెళ్తాయన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

# ఆస్తి కోసం కొడుకు చేసిన కుట్రలకు సుప్రీంకోర్టు చెక్.. తల్లి కాళ్లు పట్టుకోమని ఆదేశం..

ఇంటర్‌నెట్ డెస్క్:

ఓ వ్యక్తి మోసపూరితంగా తల్లిదండ్రుల ఆస్తిని తన సొంతం చేసుకోవాలని అనుకున్నాడు. ఇందుకోసం నకిలీ పత్రాలను తయారు చేశాడు. ఆస్తి తనదేనంటూ సుప్రీంకోర్టుకు వెళ్లాడు. తల్లిదండ్రులను మోసం చేయాలని భావించిన అతడికి సుప్రీంకోర్టు ఊహించని షాక్ ఇచ్చింది. పిటిషన్‌ను కొట్టివేయడమే కాకుండా.. తల్లి పాదాలు తాకి క్షమాపణ కోరమని అతడిని ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన ఓ వృద్ధ జంట ఎంతో కష్టపడి బిల్డింగ్ కట్టుకుంది. ఆ బిల్డింగ్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లో ఆ దంపతుల కొడుకు, కోడలు ఉంటున్నారు. ఆ బిల్డింగ్ మొత్తాన్ని సొంతం చేసుకోవాలని వృద్ధ దంపతుల కుమారుడికి బుద్ధి పుట్టింది. ఈ నేపథ్యంలోనే నకిలీ పత్రాలు సృష్టించాడు. ఆ బిల్డింగ్‌కు తానే యజమానినని చెప్పుకోవటం మొదలెట్టాడు. దీంతో వృద్ధ దంపతులు కోర్టును ఆశ్రయించారు. జిల్లా కోర్టు, ఢిల్లీ హైకోర్టు వారికి సానుకూలంగా తీర్పును ఇచ్చాయి. దీంతో వృద్ధ దంపతుల కుమారుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. గురువారం ఈ పిటిషన్‌పై జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆస్తి కోసం తల్లిదండ్రులను కోర్టుకు ఈడ్చిన కుమారుడికి ధర్మాసనం మొట్టికాయలు వేసింది. 'తల్లి పాదాలు తాకి ఆశీర్వాదం తీసుకో. ఆమెను క్షమించమని కోరు' అని ఆదేశించింది. తల్లిదండ్రులను వేధించే వారికి, ఆస్తి కోసం మోసం చేసేవారికి న్యాయస్థానాల నుంచి రక్షణ ఉండదని ధర్మాసనం పేర్కొంది. భారతీయ సమాజంలో.. అన్ని మతాల్లో తల్లికి ఉన్నతస్థానం ఉందని తెలిపింది. కొడుకు పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. 60 రోజుల్లో ఇంటిని ఖాళీ చేయాలని, తల్లిదండ్రులకు పరిహారం ఇవ్వాలని స్పష్టం చేసింది.

# ఏఐ ఫేక్ వీడియోలతో మోసాలు.. ప్రజలకు ప్రియాంక గాంధీ ఆఫీస్ హెచ్చరిక..

న్యూఢిల్లీ,

సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఏఐ ఫేక్ వీడియోలను నమ్మి మోసపోవద్దని ఆమె ఆఫీస్ ప్రజలను హెచ్చరించింది. సైబర్ నేరగాళ్లు ప్రియాంక గాంధీ వాయిస్, ముఖంతో ఏఐ వీడియోలు సృష్టిస్తున్నారని పేర్కొంది. ప్రియాంక గాంధీ పేరుతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వైరల్ అవుతున్న ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ వీడియోలను క్లిక్ చేయవద్దని ప్రియాంక గాంధీ ఆఫీస్ విజ్ఞప్తి చేసింది. సోషల్ మీడియాలో ప్రియాంక పేరుతో అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే వెంటనే 'రిపోర్ట్' లేదా 'బ్లాక్' చేయాలని కోరింది. పెట్టుబడుల పేరిట జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలని ప్రియాంక గాంధీ ఆఫీస్ ప్రజలను హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది.

# ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్,

ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వారు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. జులై 17 నుంచి నూతన ఈహెచ్ఎస్ సదుపాయం అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈహెచ్ఎస్ పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. అర్హులందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. ఓటీపీతో హెల్త్ కార్డు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈహెచ్ఎస్ కింద ఏడాదికి రూ.1,056 కోట్ల బడ్జెట్ కేటాయించామని చెప్పారు. నెలకు రూ.88 కోట్ల నిధులు సమకూరుతున్నాయని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు 1.5 శాతం చొప్పున చెల్లింపు.. ప్రభుత్వం కూడా అంతే మొత్తం చెల్లిస్తుందని పేర్కొన్నారు. 921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఆ జాబితాలో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 37 వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరో 25 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీ-ఆథరైజేషన్ చేసినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు.

# శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

హైదరాబాద్,

తెలంగాణ శాసనమండలి నుంచి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ సభ్యులు వాకౌట్ చేశారు. గురువారం మండలి ప్రారంభమైన తర్వాత 22ఎపై చర్చించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. అందుకోసం వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను శాసనమండలి చైర్మన్ తిరస్కరించారు. దాంతో బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. చైర్మన్ పోడియం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. పేపర్లు చించి గాలిలోకి ఎగరేశారు. అనంతరం మండలి నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించిన బీఆర్ఎస్ సభ్యులు బయటకు వెళ్లిపోయారు.

# మంత్రి తుమ్మలపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

హైదరాబాద్,

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, రాకేష్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. మంత్రిగా తుమ్మల చాలా బాగా పనిచేస్తున్నారని.. తాము ఇలాంటి మంత్రిని చూడలేదని పేర్కొన్నారు. ఎప్పుడైనా ఫోన్ చేసినా తుమ్మల స్పందిస్తారని.. ఆదివారం రోజున కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. పనిలో ఉన్న సమయంలో ఫోన్ ఎత్తలేకపోయినా తిరిగి కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేస్తే మంచి అని చెప్పాల్సిందేనని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ఏదైనా సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తే ఓపికగా విని.. దాని పరిష్కారం కోసం ఫాలోఅప్ చేస్తారని బీజేపీ ఎమ్మెల్యేలు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకూ సంబంధిత అధికారులతో మాట్లాడటంతో పాటు.. మళ్లీ ఫోన్ చేసి పరిస్థితిని వివరిస్తారని చెప్పారు. ఎప్పుడు సమస్య పరిష్కారం అవుతుందో కూడా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తారని పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

# ఆర్టీసీని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం: మంత్రి పొన్నం

హైదరాబాద్,

ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్ లైన్ లాంటిదని తెలంగాణ రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకార్ అభివర్ణించారు. గురువారం అసెంబ్లీలో ఆర్టీసీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లో మినీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని చూస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 540 ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నాయని వివరించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన రోజే అసెంబ్లీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం టీజీఎస్‌ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఆర్టీసీ డిపోలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. యాదాద్రి జిల్లాలోని వంగపల్లి మండలంలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లో ఆర్టీసీ డిపోల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మిర్యాలగూడలో నూతన డిపో ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. చనిపోయిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

# మద్యం కుంభకోణం కేసులో రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డికి చుక్కెదురు



ఢిల్లీ,

ఏపీలో లిక్కర్ రవాణా కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. ముందస్తు బెయిల్ కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నారని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. ఈడీ కస్టడీ నుంచి తిరిగి సిట్ కస్టడీకి తీసుకోవాలని సూచించింది.

### ఇది తీవ్రమైన కేసు: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

ఇది అత్యంత తీవ్రమైన కేసని, ఇందులో రాజ్ కసిరెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నారని ధర్మాసనంలోని మిగిలిన జడ్జిలకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) కేసుతో పాటు ఇతర దర్యాప్తు సంస్థల కేసులు సమాంతరంగా విచారణ జరిపితే తప్పేమిటని నిందితుల తరపు న్యాయవాదులను సీజేఐ ప్రశ్నించారు. ఈడీ కస్టడీ ముగిసిన తర్వాత, సిట్ కస్టడీకి తీసుకునేందుకు ప్రొడక్షన్ వారెంట్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆ ప్రక్రియ ముగిసిన అనంతరం సంబంధిత కింది కోర్టులో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. మెరిట్స్ ఆధారంగా బెయిల్ దరఖాస్తును కోర్టు పరిశీలిస్తుందని తేల్చిచెప్పింది.

# థాయ్‌లాండ్‌కు వెళ్తున్నారా?.. కొత్త రూల్స్ తెలుసుకోండి.!

ఇంటర్నెట్ డెస్క్: థాయ్‌లాండ్‌కు వెళ్లాలని ప్లాన్ చేస్తున్న భారతీయ ప్రయాణికులు కొత్త నిబంధనలను తెలుసుకోవాలి. సెప్టెంబర్ 15, 2026 నుంచి భారతీయ సాధారణ పాస్‌పోర్ట్‌దారులు వీసా లేకుండా థాయ్‌లాండ్‌లో ఉండే గడువులో మార్పు వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు పాటించాల్సిన నిబంధనలు, వెంట తీసుకెళ్లాల్సిన పత్రాలపై బ్యాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయం పలు సూచనలు చేసింది.

**వీసా లేకుండానే థాయ్‌లాండ్‌కు వెళ్లొచ్చు**

భారతీయ పర్యాటకులు వీసా లేకుండానే థాయ్‌లాండ్‌కు వెళ్లవచ్చు. అయితే సెప్టెంబర్ 15 నుంచి వీసా మినహాయింపు కింద అక్కడ ఉండే గడువును 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించారు. అంటే పర్యాటకం కోసం వెళ్లే భారతీయ సాధారణ పాస్‌పోర్ట్‌దారులు ముందుగా వీసా తీసుకోవాల్సిన అవసరం లేదు. అయితే గరిష్ఠంగా 30 రోజుల వరకు మాత్రమే ఉండేందుకు అనుమతి ఉంటుంది.

**పాస్‌పోర్ట్ ఆరు నెలలు చెల్లుబాటులో ఉండాలి**

థాయ్‌లాండ్‌కు చేరుకునే తేదీ నుంచి మీ పాస్‌పోర్ట్ కనీసం ఆరు నెలలు చెల్లుబాటులో ఉండాలి. కాబట్టి ప్రయాణానికి ముందే పాస్‌పోర్ట్ గడువు తేదీని చెక్ చేసుకోవడం మంచిది. పాస్‌పోర్ట్ గడువు దగ్గరలో ఉంటే ముందుగానే దాన్ని రెన్యువల్ చేసుకోవాలి.

# నర్సింగ్ కళాశాల పనులు 10 రోజుల్లో పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రియాంక;

(నారాయణపేట, అక్షర కలం, సెప్టెంబర్,10)

నారాయణపేట జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న నర్సింగ్



కళాశాల, హాస్టల్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నారాయణపేటలోని నర్సింగ్ కళాశాల ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్, నిర్మాణ పనుల పురోగతి, కళాశాల సౌకర్యాల గురించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ కళాశాల భవనాలు, హాస్టల్ గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం, వంటగది (కిచెన్), భోజనశాల (డైనింగ్ హాల్) ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ప్రస్తుతం జరుగుతున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి, వాటిని త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో జాప్యం ఉండకూడదని, పది రోజుల గడువులోగా కాంపౌండ్ వాల్తో పాటు అవసరమైన భవనాల పనులు పూర్తి చేసి, సంబంధిత శాఖలకు అప్పగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతి, భద్రత కల్పించేందుకు ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సంపత్, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఈ తనిఖీ ద్వారా నర్సింగ్ కళాశాల, హాస్టల్ నిర్మాణ పనులు వేగవంతం అయ్యే అవకాశం ఉందని స్థానిక వర్గాలు భావిస్తున్నాయి.




# నారాయణపేటను బాల్యవివాహాలు, బాలకార్మికులు లేని జిల్లాగా మార్చాలి: - కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక ;

(అక్షర కలం,నారాయణపేట, సెప్టెంబర్ 10: )

నారాయణపేట జిల్లాను బాల్యవివాహాలు, బాలకార్మికులు లేని జిల్లాగా మార్చే లక్ష్యంతో అందరూ కలిసి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి. హెచ్.ప్రియాంక పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధి-- శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం




ఆధ్వర్యంలో 'బేటీ బచావో--బేటీ పడావో' పథకం కింద ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కలెక్టర్ కార్యాలయంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు నైపుణ్య శిక్షణలు పొంది ఆర్థిక సాధికారత సాధించాలని, ఉన్నత విద్య చదివి జీవితంలో ఉన్నత రంగాల్లో రాణించాలని అన్నారు. జిల్లాను బాల్యవివాహాలు, బాలకార్మికులు లేని జిల్లాగా మార్చుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. కంప్యూటర్ పరిజ్ఞానం ద్వారా ఆన్‌లైన్ వ్యాపారాలు చేయవచ్చని, డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అవకాశాలు సంపాదించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ మహిళాభివృద్ధి--శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'బేటీ బచావో-- బేటీ పడావో' కార్యక్రమాలను వివరించారు. లింగ వివక్షత లేని సమాజం నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 45 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వెంకట్రాములు స్నేహ గ్రూప్స్ ప్రధాన ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించారు. బాలికలు సంఘాలు నిర్మించుకొని సంఘటితమై సాధికారత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ రషీద్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ నరసింహులు, జెండర్ స్పెషలిస్టులు అనిత, నర్సిములు, శిక్షణ కేంద్రాల మేనేజింగ్ డైరెక్టర్లు వెంకటేష్, పటేల్ ఆంజనేయులు, శ్రీనివాస్, శిశు సంక్షేమ శాఖ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# మెడినోవా వైద్యుల ఘనత.. 6.2 కిలోల కణితి తొలగింపు




మేడ్చల్, సెప్టెంబర్ 10 (అక్షరకలం):

మేడ్చల్‌లోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు 58 ఏళ్ల మహిళ పొత్తికడుపులో ఉన్న 6.2 కిలోల భారీ అండాశయ కణితిని విజయవంతంగా తొలగించారు. మెదక్ జిల్లా గంధారపల్లికి చెందిన మహిళ మూడు నెలలుగా కడుపు ఉబ్బరం, అజీర్ణంతో బాధపడుతూ ఆస్పత్రిని సంప్రదించారు. పరీక్షల్లో సుమారు 32ఐ30 సెం.మీ. పరిమాణంలో కణితి ఉన్నట్లు గుర్తించారు. ఇది పొత్తికడుపు నుంచి పైభాగం వరకు విస్తరించి, గర్భాశయం, సిగ్మాయిడ్ కోలన్, రెక్టమ్ తదితర అవయవాలకు అంటుకుని ఉండటంతో శస్త్రచికిత్స సవాల్‌గా మారింది. అంతేకాకుండా రోగికి మైల్డ్ డయాస్టొలిక్ డిస్‌ఫంక్షన్, మైల్డ్ పల్మనరీ హైపర్‌టెన్షన్ ఉన్నట్లు కార్డియాలజీ పరీక్షల్లో గుర్తించారు. కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డా. సోనియా రెడ్డి, జనరల్ సర్జన్ డా. మనోజ్ కుమార్, అనస్థీషియా వైద్యులు డా. మాధవ్ రెడ్డి, డా. శిరీషతో కూడిన వైద్య బృందం సమన్వయంతో ఎక్స్‌ప్లోరేటరీ లాపరోటమీ నిర్వహించి, సుమారు 6.2 కిలోల బరువున్న సీరస్ సిస్టాడెనోమా కణితిని విజయవంతంగా తొలగించింది. నిపుణుల సమన్వయంతో శస్త్రచికిత్స సురక్షితంగా పూర్తై, రోగి పూర్తిగా కోలుకుని ఇంటికి వెళ్లినట్లు వైద్యులు తెలిపారు. సరైన సమయంలో నిపుణులను సంప్రదిస్తే క్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చున్నారు.

# శ్రావణంలో వివిధ రూపాలలో దర్శనమిచ్చిన వన దుర్గమ్మ

అక్షర కలం, అందోలు ప్రతినిధి(చాపల సత్యం):

ఏడుపాయల వన దుర్గభవాని మాత పుణ్యక్షేత్రం తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ ఉత్తర వాహినిగా ప్రవహించే మంజీరా నది ఏడుపాయలుగా విభజన చెంది ప్రవహిస్తూ ఉంటుంది. గలగల పారే మంజీరమ్మ పరవళ్ల, కోతుల సయ్యాటలు, పక్షుల కిలకిల రావాలు, పచ్చని వనం, పెద్ద పెద్ద (బండ రాళ్లు) గుట్టల మధ్య కొలువైన అమ్మవారు వన దుర్గాభవాని మాతగా భక్తులకు దర్శనమిస్తుంది. శ్రావణ మాసంలో అమ్మవారు భక్తులకు వివిధ రూపాలలో



దర్శనం ఇచ్చింది. ఒక్కొక్క రోజు అమ్మవారిని ఆలయ అర్చకులు శంకర్ శర్మ, పార్థీవ శర్మతో పాటు మిగతా అర్చకులు అమ్మవారి అలంకరణలకు కావలసినవి



సేకరించేందుకు శ్రమించి, అమ్మవారిని సుందరంగా అలంకరించడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆ దివ్య దర్శనాలను పునీతులయ్యారు.

# 'ఆశా' వర్కర్ల ఛలో హైదరాబాద్ జయప్రదం చేయాలి

### - బి ఆర్ టి యు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్

మేడ్చల్, సెప్టెంబర్ 10 (అక్షరకలం):



ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం నేడు జరగనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బి ఆర్ టి యు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆశా లకు 18వేల ఫిక్స్ వేతనం ఇవ్వాలని, మేనిఫెస్టోలో పెట్టిన ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎన్సి టార్గెట్ వెంటనే ఎత్తివేయాలని, ఖాళీగా ఉన్న ఆశా పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, బిఎల్ఓ డ్యూటీల నుండి ఆశా లకు మినహాయించాలని, ప్రభుత్వ పథకాలు ఆశా వర్కర్లకు వర్తింప చేయాలనే పలు డిమాండ్ల సాధనకు ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని సంబు ప్రభాకర్ తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు విజ్ఞాన యాత్ర

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు విజ్ఞాన యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 30 మంది ఆయిల్ పామ్ సాగు ఆసక్తిగల రైతులను ఖమ్మం జిల్లా, కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సహకారంతో తీసుకు వెళ్లడం జరిగినది.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ ఆయిల్ పామ్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ విజ్ఞాన యాత్రను ఏర్పాటు చేశారు.ఈ విజ్ఞాన యాత్ర ద్వారా రైతులు ఆయిల్ పామ్ తోటలను ప్రత్యక్షంగా




సందర్శించి, సాగు విధానాలు, మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్య పద్ధతులు, పంట దిగుబడులు, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు.అదేవిధంగా, అక్కడ ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖిగా మాట్లాడి, వారు అనుసరిస్తున్న సాగు పద్ధతులు, పంట ద్వారా పొందుతున్న ఆర్థిక ప్రయోజనాలు మరియు ఎదురైన అనుభవాలను తెలుసుకునే అవకాశం కల్పించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెరిగి, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టేందుకు ప్రోత్సాహం లభించనుంది.ఈ విజ్ఞాన యాత్రను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి సంగీత గారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని అందించే పంట అని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆయిల్ పామ్ సాగు విస్తరణ వైపు ముందుకు రావాలని సూచించనున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు వివిధ మండలాల నుండి ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల రైతులు, ఉద్యాన శాఖ అధికారులు మరియు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

# చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

అక్షర :కలం రంగారెడ్డి

గురువారం వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సునీల్, సంఘాల నాయకులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ క్రిష్టాపురం గ్రామం, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లాలో జన్మించిందని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కార్యక్రమంలో పాల్గొన్న సంఘాల నాయకులు అన్నారు. ఈ భూమినాది, పండించిన పంటనాది, తీసుకెళ్లడానికి దొరెవ్వడు, నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు, అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రటైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని అన్నారు. 1940-44 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్ ముఖ్, రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టిందని తెలిపారు. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ సెప్టెంబర్ 10, 1985న అనారోగ్యంతో మరణించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, రజక సంఘం ప్రెసిడెంట్ ఎం. అజయ్, కౌన్సిలర్ ఆంజనేయులు బి. సి. ఫ్రంట్ ఛైర్మన్ మల్లేష్ యాదవ్, ఆదిభట్ల మున్సిపల్ ఛైర్మన్ నిరంజన్ రెడ పాల్గోన్నారు.



# ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10:

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- 2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా



అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026లో హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ క్రమంలో మార్కింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల విచారణ వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలని, ఎస్ఐఆర్ --2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాలాపూర్ యూపీహెచ్‌సీలో వైద్య సేవలపై అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పరిశీలన

రంగారెడ్డి :అక్షర కలం

బాలాపూర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్ సి )ను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి గురువారం సందర్శించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆమె సమీక్షించారు.ముఖ్యంగా హెచ్‌పీవీ ( హెచ్ పి వి ) టీకా కార్యక్రమం అమలును పరిశీలించిన అదనపు కలెక్టర్, అర్హులైన బాలికలందరికీ టీకా అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. బాలికలు, తల్లిదండ్రులకు హెచ్‌పీవీ టీకా ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ కిరణ్మయి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్ అక్రమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10:

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - 2026లో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి మండల తహశీల్దార్ దిలీప్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియ నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో ఓటర్లకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిట్టపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. ఆసరా పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి లాగిన్ నుండి ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆహారం నాణ్యతను పరిశీలించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# భారత్ కిసాన్ వెల్ఫేర్ ఫౌండేషన్ (తెలంగాణ )రాష్ట్ర చైర్మన్ పెరుక కుమారస్వామి సులభ రుణాలు, తక్కువ వడ్డీతో ఆర్థిక సహాయం అందించాలి

## సంపాదకీయం...

# యుద్ధ విరమణ దిశగా సాగని చర్చలు!!

**రష్యా- ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగిన ఎ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా-రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ సందర్భంగా, పుతిన్ యూరోప్ పట్ల రష్యాకు దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషాకోవ్, పుతిన్ మరియు ట్రంప్ మధ్య జరిగిన ఈ గంటల సంభాషణ 'సంఘటితమైన మరియు చాలా స్పష్టమైనది' అని పేర్కొన్నారు.**

విట్కాఫ్ మరియు కుష్నర్ చేసిన సందర్శన ఫలితాలను మాస్కో సానుకూలంగా చూస్తుందని ఆయన చెప్పారు. 'డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం



చేశాడు, ఇది అమెరికా మరియు రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ చెప్పారు. 'ఈ దృష్టిలో, ఇది వాణిజ్య మరియు ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభావం చూపుతుంది, రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్షతలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నాడు. ఈ దృష్టిని పుతిన్ మద్దతు ఇచ్చారు'. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేందుకు ట్రంప్ మరియు పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో యూరోపియన్ దేశాల పట్ల రష్యా యొక్క దురాశల గురించి చర్చ జరిగింది. 'యూరోప్ పట్ల మాకు ఏ దురాశలు లేవు' అని ఉషాకోవ్ చెప్పారు. ఈ కాల్‌పై వైట్ హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుండి వెంటనే స్పందన లేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్ మరియు స్టీవ్ విట్కాఫ్ మాస్కో మరియు కీవ్‌లో పుతిన్ మరియు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరు చర్చలకు వెళ్లారు. ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ప్రధానమైన ప్రగతి సాధించలేకపోయాయి, మరియు రెండు దేశాలు శుక్రవారం జరిగిన శాంతి విరమణ తర్వాత తమ వాయు యుద్ధాన్ని కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన ప్రకారం, రష్యా కీవ్ నగరాన్ని డ్రోన్లు మరియు మిస్సైల్‌లతో బాంబు విసిరినప్పుడు రెండు వ్యక్తులు మరణించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో రెండు వ్యక్తులు మరణించారు. ఇటీవల నెలలుగా, రష్యా మరియు ఉక్రెయిన్ ఒకదానికొకటి నష్టపరిహారం చెల్లించేందుకు తమ వాయు యుద్ధాన్ని పెంచాయి. ఈ రోజు ముందుగా, రష్యా అధ్యక్షుడి ప్రాతినిధి దిమిత్రి పెస్కోవ్, 'రష్యాకు విజయానికి దగ్గరగా ఉన్నామని' చెప్పారు, 'విజయం చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ , దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. 11న దిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ – పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలో నైనా రష్యా యుద్ధం ముగింపుకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

---

### కేంద్ర ఆర్థిక, పెట్రోలియం మంత్రిత్వ శాఖలకు భారత్ కిసాన్ వెల్ఫేర్ ఫౌండేషన్ విజ్ఞప్తి

### తెలంగాణలో రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ విలువ శృంఖల బలోపేతమే లక్ష్యం

**అక్షర కలం సిద్దిపేటసెప్టెంబర్10:**

తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం పనిచేస్తున్న ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఫ్ పి ఓ స్ ), అగ్రి ఆధారిత సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని భారత్ కిసాన్ వెల్ఫేర్ ఫౌండేషన్ (తెలంగాణ) రాష్ట్ర చైర్మన్ పెరుక కుమారస్వామి కోరారు. రైతులకు నేరుగా సేవలందిస్తూ వ్యవసాయ ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు కీలక పాత్ర పోషిస్తున్న ఈ సంస్థలకు సులభమైన బ్యాంకు రుణాలు, తక్కువ వడ్డీ రేట్లతో క్రెడిట్ సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భారత్ కిసాన్ వెల్ఫేర్ ఫౌండేషన్ తెలంగాణలో ప్రస్తుతం 20 ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఫ్ పి ఓ స్ )తో కలిసి పనిచేస్తోందని కుమారస్వామి తెలిపారు. ఈ ఎఫ్‌పీవోల ద్వారా దాదాపు 10,000 మంది రైతులకు వివిధ రకాలుగా ప్రయోజనం చేకూరుతోందని పేర్కొన్నారు. రైతులను సమూహాలుగా సంఘటితం చేసి, వారి ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ కల్పించడం, వ్యవసాయ ఇన్‌పుట్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం, వ్యవసాయ యంత్రాలు, ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, లాజిస్టిక్స్, మార్కెట్ లింకేజీ వంటి సేవలను బలోపేతం చేయడంలో ఎఫ్‌పీవోలు కీలకంగా పనిచేస్తున్నాయని వివరించారు.

**రైతు నుంచి మార్కెట్ వరకు కీలక పాత్ర**

వ్యవసాయ రంగం అభివృద్ధి కేవలం పంటల సాగుతోనే సాధ్యం కాదని, పంట ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వరకు మొత్తం వ్యవసాయ విలువ శృంఖల బలోపేతం కావాల్సిన అవసరం ఉందని పెరుక కుమారస్వామి అన్నారు. ఈ ప్రక్రియలో ఎఫ్‌పీవోలతో పాటు వ్యవసాయ ఆధారిత సంస్థలు కీలకమైన భాగస్వాములుగా నిలుస్తున్నాయని తెలిపారు.

రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్స్ అందించడం, ఆధునిక వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడం, పంటలను ప్రాసెసింగ్ చేయడం, శాస్త్రీయ పద్ధతుల్లో నిల్వ చేయడం, రవాణా సదుపాయాలను కల్పించడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను విక్రయించడం వంటి కార్యకలాపాల ద్వారా అగ్రి ఆధారిత సంస్థలు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.

అయితే ఈ సంస్థలు తమ కార్యకలాపాలను విస్తరించి మరింత మంది రైతులకు సేవలు అందించేందుకు అవసరమైన స్థాయిలో ఆర్థిక వనరులు అందుబాటులో లేకపోవడం ఒక ప్రధాన సమస్యగా ఉందన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందే సమయంలో అనేక సంస్థలు ఆర్థిక, సాంకేతిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

**తక్కువ వడ్డీతో రుణ సదుపాయాలు కల్పించాలి**

ఎఫ్‌పీవోలు, అర్హత కలిగిన అగ్రి ఆధారిత సంస్థలను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, వాటికి తక్కువ వడ్డీ రేట్లతో రుణాలు అందించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని కుమారస్వామి కోరారు.

సులభమైన నిబంధనలతో బ్యాంకు రుణాలు, వర్కింగ్ క్యాపిటల్, పెట్టుబడి రుణాలు, క్రెడిట్ సదుపాయాలు అందుబాటులోకి వస్తే ఈ సంస్థలు మరింత బలపడతాయని అన్నారు. తద్వారా పెద్ద సంఖ్యలో రైతులకు సేవలు




విస్తరించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.

అర్హత కలిగిన ఎఫ్‌పీవోలు, అగ్రి ఆధారిత సంస్థలకు ప్రయారిటీ సెక్టార్ లెండింగ్ (పి స్ ల్ ) కింద తగిన ప్రాధాన్యత కల్పించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని ఆయన కోరారు.

**కేంద్ర ప్రభుత్వానికి ఫౌండేషన్ విజ్ఞప్తి**

ఈ అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి తమ ఫౌండేషన్ తరఫున విజ్ఞప్తి చేసినట్లు పెరుక కుమారస్వామి తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డి ఫ్ స్ ) సెక్రటరీ సంజయ్ లోహియా (ఐఏఎస్ )తో పాటు, కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మను కలిసి ఎఫ్‌పీవోలు, అగ్రి ఆధారిత సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించినట్లు తెలిపారు. రైతుల కోసం పనిచేస్తున్న సంస్థలకు ఆర్థికంగా అండగా నిలిచే విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

**పీఎం ఈ -డ్రైవ్ పథకంలో ఎఫ్‌పీవోలకు అవకాశం కల్పించాలి.**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం ఈ -డ్రైవ్ పథకం ద్వారా తెలంగాణలో ప్రతిపాదిత ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవి ) చార్జింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో అర్హత కలిగిన ఎఫ్‌పీవోలు, భారత్ కిసాన్ వెల్ఫేర్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్న వ్యవసాయ ఆధారిత సంస్థలకు కూడా భాగస్వామ్యం కల్పించాలని కోరినట్లు కుమారస్వామి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈవి ఛార్జింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో రైతు సంస్థలు, గ్రామీణ అగ్రి ఆధారిత సంస్థలను భాగస్వామ్యం చేయడం ద్వారా కొత్త ఆర్థిక అవకాశాలు ఏర్పడతాయని ఆయన అన్నారు.

వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న సంస్థలకు కొత్త వ్యాపార అవకాశాలు లభించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ విధంగా వ్యవసాయం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాలను అనుసంధానం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

**కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన డిమాండ్లు**

ఎఫ్‌పీవోలతో కలిసి పనిచేస్తున్న అర్హత కలిగిన అగ్రి ఆధారిత సంస్థలకు ప్రత్యేక కేటగిరీ గుర్తింపు కల్పించాలి.ఎఫ్‌పీవోలు, అగ్రి ఆధారిత సంస్థలకు సులభమైన నిబంధనలతో బ్యాంకు రుణాలు అందించాలి.తక్కువ వడ్డీ రేట్లతో ప్రత్యేక క్రెడిట్ సదుపాయాలు కల్పించాలి.అర్హత కలిగిన సంస్థలకు ప్రాధాన్యతా రంగ రుణాలు (ప్రయారిటీ సెక్టార్ లేండింగ్ ) అందేలా చర్యలు తీసుకోవాలి.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న, భవిష్యత్తులో ప్రవేశపెట్టే ఆర్థిక సహాయ పథకాల్లో ఎఫ్‌పీవోలు, అగ్రి ఆధారిత సంస్థలకు తగిన ప్రాధాన్యత కల్పించాలి. తెలంగాణలో ప్రతిపాదిత ఈవిచార్జింగ్ ప్రాజెక్టుల్లో అర్హత కలిగిన ఎఫ్‌పీవోలు, అగ్రి ఆధారిత సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలి. వ్యవసాయ విలువ శృంఖల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలి.

**రైతుల ఆదాయం పెంపే ప్రధాన లక్ష్యం**

ఎఫ్‌పీవోలు, అగ్రి ఆధారిత సంస్థలకు ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తే రైతుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ కల్పించడంతో పాటు మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించవచ్చని పెరుక కుమారస్వామి అన్నారు. రైతులు సమూహంగా తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకునే అవకాశం పెరుగుతుందని, ప్రాసెసింగ్ మరియు విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లు, నిల్వ కేంద్రాలు, లాజిస్టిక్స్ సదుపాయాలు, మార్కెట్ లింకేజీలు అభివృద్ధి చెందితే రైతులకు మాత్రమే కాకుండా యువతకు కూడా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. తెలంగాణలో రైతు ఆధారిత సంస్థలను మరింత బలోపేతం చేయడం ద్వారా రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ విలువ శృంఖల అభివృద్ధి, గ్రామీణ ఉపాధి విస్తరణ, వ్యవసాయ రంగంలో పెట్టుబడుల పెంపు సాధ్యమవుతుందని కుమారస్వామి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాలను సానుకూలంగా పరిశీలించి, ఎఫ్‌పీవోలు మరియు అగ్రి ఆధారిత సంస్థలకు ప్రత్యేక ఆర్థిక, విధానపరమైన ప్రోత్సాహకాలు కల్పించాలని ఆయన కోరారు. రైతుల ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వ సంస్థలు, ఎఫ్‌పీవోలు, అగ్రి ఆధారిత కంపెనీలు సమన్వయంతో పనిచేస్తే తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని మరింత స్థిరమైన, లాభదాయకమైన, స్వయం సమృద్ధి కలిగిన వ్యవస్థగా తీర్చిదిద్దవచ్చని భారత్ కిసాన్ వెల్ఫేర్ ఫౌండేషన్ (తెలంగాణ) చైర్మన్ పెరుక కుమారస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు.

---

# పోషకాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

### అక్కెనపల్లి అంగన్వాడీలో పోషణ మాసం అవగాహన

**అక్షర కలం సిద్దిపేట సెప్టెంబర్ 10:**

బాలింతలు, చిన్న పిల్లలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఏసీడీపీఓ హరిత సూచించారు.నంగునూర్ మండలంలోని అక్కెనపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న బాలామృతాన్ని 6 నెలలు నిండిన శిశువులకు తప్పనిసరిగా పెట్టాలన్నారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యలక్ష్మి మెనూను క్రమం తప్పకుండా పాటించాలని సూచించారు.ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో ఆకుకూరలు,



కూరగాయలు, పప్పు దినుసులు, గుడ్లు ఉండేలా చూసుకోవాలని, దీనివల్ల తల్లీబిడ్డలు రక్తహీనత, పోషకాహార లోపం బారిన పడకుండా ఉంటారని తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు బాలామృతం, గర్భిణీలకు పోషకాహారం అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతరాజు రేణుక రమేష్,ఐ సి డి స్ సూపర్వైజర్ రమాదేవి,సి ఆర్ పి శిరీష, అంగన్వాడీ టీచర్లు పద్మ, వసుమతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం - జిల్లా ఎన్నికల అధికారి హైమావతి

**అక్షర కలం సిద్ధిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 :**

ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పకడ్బందీగా నిర్వహించాలనీ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం అని జిల్లా ఎన్నికల అధికారి హైమావతి అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలం చెర్ల అంకిరెడ్డి పల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆవరణలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పకడ్బందీగా నిర్వహించాలని, ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఆధారాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన అన్ని నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు. నోటీసుల అందజేత, విచారణ, ఆధారాల నమోదు తదితర ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మన లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఆర్ఓ తహసీల్దార్ సలీం, సర్వే ల్యాండ్ అధికారి సుదర్శన్, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



---

# కచిరి కాడ ముచ్చట్లు

పచ్చని పొలాల మధ్యలో ఉన్న చిన్న పల్లె కచిరి. చూడటానికి చిన్న ఊరే అయినా, ఇక్కడి ముచ్చట్లు మాత్రం పెద్దగానే ఉంటయ్.ఊళ్ళో ఉదయం ఐదు గంటలకే రోజు మొదలవుతుంది. పాల కేంద్రం కాడ, కూడలిలోని టీ కొట్టు కాడ జనం చేరతరు. ఆ టీ కొట్టే ఈ ఊరికి పార్లమెంట్ లాంటిది.అక్కడ మూడు రకాల ముచ్చట్లు నడుస్తయ్. ఒకటి రైతు ముచ్చట్లు – వానలు, పంటలు, ఎరువుల ధరల గురించి. రెండు పంచాయతీ పనులు, రోడ్లు, నీళ్ల గురించి. మూడు సినిమా, ఊరి విశేషాల గురించి. ఒక టీ, రెండు బిస్కెట్లతో ప్రపంచం మొత్తం మాట్లాడేస్తరు.పండుగలు వచ్చాయంటే ఊరి రూపే మారిపోతుంది. బతుకమ్మ వచ్చిందంటే ఆడోళ్లు ఒకచోట చేరి ఆటపాటలు. బోనాలప్పుడు ఊరి చివర ఉన్న అమ్మవారి గుడి కాడ సందడి మామూలుగా ఉండదు. సంక్రాంతికి గాలిపటాలు, కోలాహలం.ఇప్పుడు కచిరి కూడా మారుతుంది. యువత చదువుల కోసం పట్నం పోతున్నారు. ఫోన్లలో కొత్త వ్యవసాయ పద్ధతులు చూసి, ఆర్గానిక్ సాగు లాంటివి ప్రయత్నిస్తున్నారు.సాయంత్రం చెరువు కట్ట మీద కూర్చుంటే వచ్చే చల్లని గాలి, పొలాల నుంచి వచ్చే మట్టి వాసన – ఈ ప్రశాంతత పట్నంలో ఎక్కడా దొరకదు. అదే కచిరి ప్రత్యేకత.

**ఆసర్ల ప్రశాంత్ యాదవ్, అక్షర కలం నియోజకవర్గం ఇంచార్జ్**

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట



# క్రికెట్ పిచ్ పై భారత్ జపాన్ ఫ్రెండ్ షిప్..

భారత్, జపాన్ దేశాల మధ్య 75 సంవత్సరాల ద్వైపాక్షిక దౌత్య సంబంధాల వేడుకలను పురస్కరించుకుని ఇరు దేశాల పురుషుల జట్లు ప్రత్యేక అంతర్జాతీయ టీ20 మ్యాచ్ లో పాల్గొననున్నాయి. ఈ మ్యాచ్ కోసం 'సుజుకి కప్' ను నిర్వహించనున్నట్లు జపాన్ క్రికెట్ అసోసియేషన్ (జేసీఏ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సంయుక్తంగా అధికారిక ప్రకటన చేశాయి. జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా సెప్టెంబర్ 22న ఈ చారిత్రాత్మక పోరును నిర్వహించనున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్ 75' పేరుతో ఈ క్రీడా సంబంధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం ఇండియా చేస్తున్న ప్రయత్నాలకు కూడా ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. ఆ సమయంలో జపాన్ వేదికగా జరిగే ఏషియన్ గేమ్స్ లో పాల్గొనే భారత పురుషుల జట్టులోని స్టార్ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు ఈ చారిత్రక మ్యాచ్ లో బరిలోకి ఆడనున్నారు. ఈ విశేష సందర్భంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ, "ఈ అరుదైన మ్యాచ్ లో భాగస్వామి కావడం బీసీసీఐకి ఎంతో సంతోషాన్నిస్తోంది. భారత జట్టు సరికొత్త గడ్డపై అడుగుపెట్టడానికి, జపాన్ తో పాటు తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్ ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఇదొక గొప్ప అవకాశం. ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల మైత్రికి ఈ మ్యాచ్ మరింత వన్నె తెస్తుంది. సంప్రదాయ క్రికెట్ దేశాలకు ఆవల కూడా ఆటను విస్తరించడం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ బోర్డుగా బీసీసీఐ బాధ్యత" అని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ జట్టును జపాన్ హోమ్ గ్రౌండ్‌కు ఆహ్వానించడం తమ అసోసియేషన్‌కు దక్కిన గౌరవమని జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ పేర్కొన్నాడు. "భారత క్రికెట్ అభిమానుల ఉత్సాహాన్ని స్వాగతించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. జపాన్ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో స్టేడియానికి వచ్చి ఆటను ఆస్వాదించి మా జట్టును ప్రోత్సహించాలి" అని అతడు వ్యాఖ్యానించాడు. ఈ ప్రత్యేక పోరు ద్వారా ఈస్ట్ ఆసియా మార్కెట్ లో క్రికెట్ క్రేజ్ ను పెంచడానికి బీసీసీఐ, జేసీఏ పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయని తెలుస్తోంది. రాబోయే కాలంలో జపాన్ లో క్రికెట్ మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు బీసీసీఐ సాంకేతిక సహకారాన్ని కూడా అందించనుంది.

# మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం

### సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడి

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ కోసం అన్ని విధాల సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ తెలిపాడు. మహమ్మద్ షమీని సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియా సమావేశంలో పాల్గొన్న తిలక్ వర్మ.. సౌత్ జోన్ తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. దేవదత్ పడిక్కల్‌తో పాటు సిరాజ్ బరిలోకి దిగుతున్నారని చెప్పాడు. 'సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని అడ్డుకునేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతుంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతని బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం. కేఎల్ రాహుల్ ఈ మ్యాచ్ ఆడటం లేదు.'అని తిలక్ వర్మ తెలిపాడు. 54 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడుతున్నాయి. ఈ ఇరు జట్లు దులీప్ ట్రోఫీ ఫైనల్లో తలపడటం ఇది రెండోసారి మాత్రం. చివరి సారిగా 1970-71 సీజన్‌లో ముంబైలోని బ్రాబోర్న్ స్టేడియంలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓవరాల్‌గా సౌత్ జోన్ దులీప్ ట్రోఫీ ఫైనల్ చేరడం ఇది 24వ సారి. ఇప్పటి వరకు సౌత్ జోన్ 13 టైటిళ్లు గెలిచింది. మరోవైపు 13 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్.. చివరి సారిగా 2012-13 సీజన్‌లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఇప్పటి వరకు 8 సార్లు ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్ రెండు టైటిళ్లు మాత్రమే గెలిచింది. ఈ ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నాడు. అతని పదవీకాలంపై ఇటీవల పెద్ద చర్చే జరిగింది. అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ.. వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉంది. ఈ విషయంపై చెన్నైలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా-అగార్కర్ మధ్య సమావేశం జరగనుంది. ఇటీవల బీసీసీఐ నిర్వహించిన రివ్యూ మీటింగ్‌కు అగార్కర్ హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల అతను ఈ మీటింగ్‌కు దూరంగా ఉన్నాడు. ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లను ఎంపిక చేయనున్నారు. మయాంక్ యాదవ్, కార్తిక్ త్యాగితో పాటు మోహ్‌సిన్ ఖాన్‌కు అవకాశం రానుంది.



# ఒక్క పరుగుతో తిలక్ వర్మ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ నిరాశకు గురి చేశాడు. చెన్నైలోని చేపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్ లో అద్భుత పోరాటపటిమను ప్రదర్శించాడు. ఒంటరి పోరాటంతో జట్టును ఇబ్బందుల నుంచి గట్టెక్కించినప్పటికీ.. ఒక్క పరుగు దూరంలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 211 బంతులను ఎదుర్కొన్న తిలక్ వర్మ.. 99 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతను అవుట్ అయ్యాక సౌత్ జోన్ తొలి ఇన్నింగ్ ఎంతో సేపు కొనసాగలేదు. 336 పరుగులకు ఆలౌట్ అయింది. నాలుగో రోజు మధ్యాహ్నానికే ఈస్ట్ జోన్ తో 394 పరుగులు వెనుకంజలో ఉందీ జట్టు. సౌత్ జోన్ లో ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ పెద్దగా రాణించలేదు. ఓపెనర్ రికి భుయ్ ఒక పరుగుకే అవుట్ అయ్యాడు. నారాయణ్ జగదీశన్- 32, దేవ్ దత్ పడిక్కల్- 62, షేక్ రషీద్- 27, స్మరన్ రవిచంద్రన్- 23, శ్రేయాస్ గోపాల్- 26 పరుగులు చేశారు. చివర్లో చామా వీ మిలింద్ 43 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ఈస్ట్ జోన్ లో ముఖేష్ కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మహ్మద్ షమీ, ఖురేషీ, శిఖర్ మోహన్ రెండేసి చొప్పున వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్ లో ఈస్ట్ జోన్ 708 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో తడాఖా చూపాడు. కుమార్ కుశాగ్ర 101తో చెలరేగాడు. ఈస్ట్ జోన్ కు ధీటుగా బదులివ్వలేకపోయింది సౌత్. తిలక్ వర్మ, దేవ్ దత్ పడిక్కల్, మిలింద్ మాత్రమే ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. ఈ క్రమంలో తిలక్ వర్మ శతకానికి చేరువ అయ్యాడు గానీ దాన్ని అందుకోలేకపోయాడు. 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు మహ్మద్ కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ ఫైనల్ లో సెంచరీకి ఒక పరుగు దూరంలో ఇలా దురదృష్టకరంగా అవుట్ కావడం విస్మయానికి గురిచేసింది. దులీప్ ట్రోఫీ ఆరంభం నుండి తిలక్ వర్మ అసాధారణంగా ఆడుతున్నాడు. అత్యుత్తమ ఫామ్‌ను కనబరుస్తోన్నాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# సినిమా

CINEMA



# 200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది. ఇతపోతే, చివరగా తెలుగు ప్రజలకు బాగా సుపరిచితమైన 'మల్లెపూల పల్లకి' పాటను ఈ సినిమాలో చూపించడం ప్లస్ పాయింట్. అభిమానులు ఆ పాటకు థియేటర్లలో భజనలు చేశారు. 'యాలాలో.. యాలాలో', 'కార్తీకమాసం' పాటలూ ఆకట్టుకున్నాయి.

# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా - విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా - విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా- విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు. ఇవి కాకుండా మరిన్ని ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి. అన్నింటిలోకి సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తోన్న వీవాన్ ఫోర్స్ ది ఫారెస్ట్ ముందు రిలీజయ్యే అవకాశం ఉంది. తాజాగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఈ సినిమాలోని సమఝోనా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం ముంబైలో జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్- తమన్నాల కెమెస్ట్రీ అదిరిపోయింది. సమజోనా పాటను పాడుతూ.. మోకాళ్లపై కూర్చొని తమన్నాకు ప్రపోజ్ చేస్తున్నట్లుగా సిద్ధార్థ్ ఉండగా.. మిల్కీబ్యూటీ చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడింది. అలాగే షూటింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనలను సిద్ధార్థ్ పంచుకున్నారు.

# ఓటీటీలోకి కాంట్రవర్సీ మూవీ

ఇటీవల కొన్ని సినిమాలు విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకుంటున్నాయి. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలు లేదా సంభాషణల విషయంలో కొన్ని సంస్థలు ఈ చిత్రాలను వ్యతిరేకించడంతో అవి థియేటర్లలో విడుదల కావడం లేదు. అలాగే బోల్డ్ కంటెంట్ కారణంగా కూడా కొన్ని సినిమాలు విడుదల కాలేదు. అయితే, ఈ చిత్రాలు ప్రస్తుతం ఓటీటీలో అందుబాటులో ఉన్నాయి. ప్రేక్షకులు కూడా ఈ చిత్రాలను ఓటీటీలో చూసేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. అలా థియేటర్లలో నిషేధానికి గురై ఓటీటీలో సంచలనం సృష్టించిన సినిమా 'అన్‌ఫ్రీడమ్'. బాలీవుడ్ దర్శకుడు రాజ్ అమిత్ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఉగ్రవాదం, మత ఛాందసవాదం, స్వలింగ సంపర్కం, ప్రేమ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి సున్నితమైన అంశాలు ఉన్నాయి. దీంతో 2015లో ఈ చిత్రానికి భారతదేశంలో థియేటర్లలో విడుదలకు ఆమోదం లభించలేదు. 'అన్‌ఫ్రీడమ్' సినిమా కథ వివిధ పాత్రల జీవితాల చుట్టూ తిరుగుతుంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# మళ్లీ 'భూ పోరాటం' ఖాయం !

## --నాడు దొరల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన వీరనారి ఐలమ్మ
## --నేడు నయా భూస్వామ్యంపై పోరాటానికి ఆదర్శం
## -- జూలకంటి రంగారెడ్డి

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

భూమి కోసం, ఆత్మగౌరవం కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో నేటి భూ దోపిడీకి వ్యతిరేకంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. నాడు ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని అన్నారు. ఆమె త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం నల్లగొండలోని సీపీఐ(ఎం) దొడ్డి కొమురయ్య భవన్‌లో ఐలమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ విస్నూరు దేశ్‌ముఖ్ దౌర్జన్యాలకు, భూస్వామ్య పెత్తందారీతనానికి ఐలమ్మ వెరవలేదన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి కష్టపడి సాగు చేసిన భూమిలో పండిన పంటను దొరలు బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు ఆమె ఎదిరించి నిలిచారని గుర్తుచేశారు. ఎర్రజెండా అండతో పోరాటం ఐలమ్మ కుటుంబ సభ్యులపై దాడులు జరిగినా, అనేక ఇబ్బందులకు గురిచేసినా ఆమె వెనక్కి తగ్గలేదన్నారు. భీమిరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి తదితర నాయకులను కలిసి వారి సహకారంతో భూమి, పంట కోసం పోరాటాన్ని



కొనసాగించారని చెప్పారు. ఎర్రజెండా నాయకత్వం అండగా నిలవడంతో దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ఐలమ్మ మరింత ధైర్యంగా పోరాడారని తెలిపారు.

**ఐలమ్మ పోరాటం.. తెలంగాణ ఉద్యమానికి బీజం**

ఐలమ్మ పోరాటం అనంతరం తెలంగాణ రైతాంగ పోరాటం విస్తరించిందని జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆ క్రమంలో దొడ్డి కొమురయ్య తొలి అమరుడిగా నిలిచారని, అనంతరం ఉద్యమం సాయుధ పోరాటంగా మారిన చరిత్రను గుర్తుచేశారు. దొరలు, భూస్వాములు గడీలు వదిలి పారిపోయే పరిస్థితి రావడంతో పాటు లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ అయ్యేలా పోరాటం సాగిందన్నారు. చివరకు నిజాం పాలనపైనా ఆ పోరాట ప్రభావం పడిందని తెలిపారు. పంచిన భూములపై మళ్లీ కన్ను నాడు రైతాంగ పోరాటాల ద్వారా పేదలకు దక్కిన భూములపై నేడు నయా పెట్టుబడిదారులు, నయా భూస్వాములు కన్నేశారని జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. కంపెనీలు, ఇతర పేర్లతో పేదల భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పాలకుల విధానాల కారణంగా మరోసారి భూమి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని భూ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నివాళులర్పించిన నాయకులు కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బీకార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, వి.వెంకటేశ్వర్లు, కందాల ప్రమీల, చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, దండంపల్లి సత్తయ్య, మల్లం మహేష్, కొండేటి శ్రీను, చౌగాని సీతారాములు, పెంజర్ల సైదులు, శంకరయ్య, పరశురాములు, వరలక్ష్మి, తుమ్మల పద్మ, నలపరాజు సైదులు, శ్రీనివాస్, వెంకన్న, ఆనంద్, రాజు, సరోజ, వెంకటరమణారెడ్డి, ఎన్.వెంకటయ్య, బిక్షం, శ్రీకర్, ధనుంజయ, నవతెలంగాణ మేనేజర్ పి.మట్టయ్య, డెస్క్ ఇన్‌చార్జి వర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల మండలంలో ఐలమ్మ, వర్ధంతి



**అక్షరకలం చిట్యాల**

నల్గొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంతో పాటు ఉరుమడ్ల, వెలిమినేడు, నేరడ గ్రామాల్లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, విద్యుత్ పోరాట అమరుడు సత్తెనపల్లి రామకృష్ణల వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రజక వృత్తిదారుల సంఘం, ప్రజా సంఘాలు, సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొరలు, భూస్వాముల అరాచకాలపై ఐలమ్మ చూపిన తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఎం నాయకులు జిట్ట నగేష్, ఐతరాజు నరసింహ, రుద్రారపు పెద్దులు కొనియాడారు. విద్యుత్ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన రామకృష్ణ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో అవిశెట్టి శంకరయ్య, పొన్నం లక్ష్మయ్య, చెరుకు సైదులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సంఖ్యలో పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మకు నివాళులర్పించిన సర్పంచ్, సిపిఎం నాయకులు



**అక్షరకలం బిబినగర్**

యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జానా సత్యనారాయణ మరియు గ్రామ పెద్దలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ?మరోవైపు బీబీనగర్ పట్టణ కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు మాట్లాడుతూ... భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటం నేటితరానికి, భావితరాలకు గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

# గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

**--మైనంపల్లి సర్పంచ్ కొర్ర రామ్ సింగ్ నాయక్**



**అక్షరకలం దేవరకొండ**

గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని మైనంపల్లి సర్పంచ్ కొర్ర రామ్ సింగ్ నాయక్ సూచించారు. గురువారం మైనంపల్లి మరియు కొర్రతండాలోని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, విటమిన్లు పుష్కలంగా ఉండే ఆహారాన్ని ప్రతినిత్యం తీసుకోవడం వల్ల తల్లితో పాటు బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొర్ర లక్ష్మీ ప్రశాంత్, పులిజాల సంతోష వెంకట్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి, జగదీష్, అంగన్వాడీ టీచర్లు కొర్ర కమలమ్మ, కొర్ర బుజ్జి దేవి పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవాలు

**వలిగొండ అక్షర కలం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని చిత్తాపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ హేమలత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు , బాలింతలు పోషణ కలిగినటువంటి ఆహార పదార్థాలు ఆకుకూరలు, గుడ్లు పాలు ,మునగాకు ఆకుకూరలు మొదలగు ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ గుంటోజు మంజుల, ఆశ కార్యకర్త బోడ కవిత మరియు తల్లులు తదితరులు పాల్గొనడం జరిగింది.



# గణేష్ మండప నిర్వాహకులకు సూచనలు జారీ చేసిన ఎస్సై శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ అక్షరకలం**

వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల ముందస్తు అనుమతులు




తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రత దృష్ట్యా పలు సూచనలు జారీ చేశారు.

**--ముందస్తు అనుమతి తప్పనిసరి...**

గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ, మున్సిపల్/గ్రామ పంచాయతీ అధికారుల నుండి ముందస్తు అనుమతి పత్రాలను పొందాలి. ట్రాఫిక్కు అంతరాయం కలగవద్దు: రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది కలిగేలా, వాహనాల రాకపోకలను అడ్డుకునేలా మండపాలను ఏర్పాటు చేయకూడదు. డీజెలపై నిషేధం ధ్వని కాలుష్యం: రాత్రి వేళల్లో సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయం దాటిన తర్వాత మైకులు, ధ్వని కాలుష్య కారక పరికరాలను వాడకూడదు. డీజేల వాడకంపై కఠిన నిబంధనలు వర్తిస్తాయి. భద్రతా చర్యలు, సీసీ కెమెరాలు ప్రతి మండపం వద్ద నిర్వాహకులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో మండపం వద్ద కనీసం ఇద్దరు లేదా ముగ్గురు నిర్వాహకులు తప్పనిసరిగా కాపలా ఉండాలి. పోలీస్ స్టేషన్ నుండి తప్పకుండా అనుమతులు తీసుకోవాలని ఎస్సై తెలిపారు. శోభయాత్ర సమయములో ఎవరైనా శాంతి భద్రతలకి విఘాతం కలిగించినట్లయితే చట్టపరముగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

# ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి --ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**అక్షరకలం ఆలేరు**

హైదరాబాద్ అసెంబ్లీ సమావేశాల్లో ఆలేరు నియోజకవర్గ ప్రజా సమస్యలు, యాదగిరిగుట్ట రవాణా ఇబ్బందులపై ప్రభుత్వ విప్,



ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం ప్రసంగించారు. ఉచిత ప్రయాణ పథకంతో రద్దీ పెరిగినందున గ్రామాలు, తండాలకు అదనపు ఆర్టీసీ బస్సులు కేటాయించాలి. యాదగిరిగుట్ట వద్ద భద్రత: భక్తుల రక్షణ కోసం యాదగిరిగుట్ట బస్ స్టాప్ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు పెంచాలి. ఆధ్యాత్మిక కేంద్రమైన యాదగిరిగుట్టకు ఎలక్ట్రిక్ బస్సులతో పాటు డిపోకు నూతన బస్సులు కేటాయించాలి. వంగపల్లి వద్ద టికెట్ పాయింట్ ఏర్పాటు చేసి, వరంగల్ ఎక్స్‌ప్రెస్ సహా అన్ని బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలి. బీర్ల అయిలయ్య విజ్ఞప్తులపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. యాదగిరిగుట్ట డిపోకు కొత్త బస్సులు ఇస్తామని, వంగపల్లి వద్ద వరంగల్ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా టికెట్ పాయింట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# వినాయక చవితి సందర్భంగా పీస్ కమిటీ సమావేశం

**అక్షర కలం, చౌటుప్పల్**

చౌటుప్పల్ వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు చౌటుప్పల్ డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి,ఆధ్వర్యంలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథ కుమార్, సమన్వయంతో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల




సర్పంచులు,యువకులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో వినాయక ఉత్సవ పీస్ కమిటీ సమావేశం ఎస్ఎం రెడ్డి గార్డెన్స్ వలిగొండ రోడ్ చౌటుప్పల్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాల నిర్వహణ,శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ,విద్యుత్ భద్రత తదితర అంశాలపై చర్చించారు. వినాయక ఉత్సవాలను ప్రతి ఒక్కరూ సమన్వయంతో భక్తిశ్రద్ధలతో మరియు ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు. అలాగే ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు,నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాలను నిర్వహించాలని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్.డీ.ఓ,మున్సిపల్ కమిషనర్,మున్సిపల్ చైర్మన్,విద్యుత్ శాఖ అధికారులు,గ్రామ సర్పంచులు,చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్లు,వివిధ శాఖల అధికారులు,వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు,యువకులు,ప్రజలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు ప్రజలు,ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖకు సహకరించాలని చౌటుప్పల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# చాకలి ఐలమ్మకు రజక సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు

**అక్షర కలం: మిర్యాలగూడ, సెప్టెంబర్ 10:**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి విగ్రహం ఐలమ్మ చౌరస్తాలో ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం మిర్యాలగూడ మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరు సుధా బాలకృష్ణ , కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు, సంఘాల నాయకులు ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ



భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగానిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ నేటి తరానికిస్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగంతుల నాగభూషణం, పోసాని గిరి, సలకలపురం యాదగిరి, వేమవరపు భీమరాజు, జలనీల రాజశేఖర్, నారాయణదాసు వెంకటేష్, నారాయణ, రాములు ,దోనకొండ వెంకన్న ,తుకారం , పగిళ్ల కళ్యాణ్, పలువురు నాయకులు, ప్రజాసంఘాలప్రతినిధులు, మహిళలు, యువకుల పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ కు ఘన నివాళులు

**అక్షర కలం: మిర్యాలగూడ: సెప్టెంబర్ 10:**

భారతీయ జనతా పార్టీ మిర్యాలగూడ వన్ టౌన్ ఆధ్వర్యంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి నిజాం గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి మిర్యాలగూడ వన్ టౌన్ అధ్యక్షులు బంటుగిరి ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకటరమణ టూ టౌన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ శివశంకర్ సీనియర్ నాయకులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాదినేని శ్రీనివాసరావు రేపాల పురుషోత్తం రెడ్డి బిజెపి చిలుకూరి శ్యామ్ వెలుగు నాగరాజు జిల్లా కార్యదర్శి చిల్లంచర్ల అభి ఓ బి సి జిల్లా కార్యదర్శి బంటు యాదగిరి కంచు కొమ్ముల వేణు వన్ టౌన్ బీజేపీ ఉపాధ్యక్షులు చిలుకూరి వెంకటేశ్వర్లు బంటు పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# విబిజి రాంజీ పనులతోనే గ్రామాభివృద్ధి - కలెక్టర్ చంద్రశేఖర్

## ఉదయాదిత్య భవన్లో అధికారుల ఓరియంటేషన్ కార్యక్రమంలో దిశానిర్దేశం

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**






విబిజి రాంజీ కింద గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం అయన ఉదయాదిత్య భవన్లో విబిజి రాంజీ పనులపై ఎంపీడీవోలు ,ఎంపీఓలు, ఏపీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామానికి ఎక్కువ పనులు వచ్చేందుకు సగటు రోజు వేతనం పెంచేలా చూడాలని, అప్పుడే ఎక్కువగా మెటీరియల్ కాంపోనెంటు గ్రామానికి వస్తుందని, ఇందుకు విబిజి రాంజీ కింద పని చేసే వారి సంఖ్యను పెంచాలని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం ఉన్న పనుల సంఖ్యను పెంచుకుంటే ఎక్కువ మొత్తంలో గ్రామానికి ఉపయోగపడతాయని, తద్వారా గ్రామాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ముందే నిర్దేశించుకున్న సమగ్ర గ్రామ పంచాయతీ ప్రణాళికను గ్రామసభలో చర్చించి గ్రామానికి అవసరం ఉన్న పనులను చేర్చుకోవాలని తెలిపారు. ముఖ్యంగా అన్ని పాఠశాలల్లో టాయిలెట్స్, తాగునీరు, కిచెన్ షెడ్లు, అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, లాబరేటరీలు చేపట్టేందుకు అవకాశం ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన అన్ని పాఠశాలల్లో ఈ పనులు మంజూరు చేసుకుని పూర్తి చేయాలని చెప్పారు .ఈ విషయాన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకొని అధికారులు పనిచేయాలని, ఇంకా ఇప్పటివరకు మంజూరు చేయనిచోట మంజూరు చేసి పనులు మొదలు పెట్టాలన్నారు. చెరువులు ఉన్న చోట మత్స్యకారుల జాబితా ఆధారంగా చేపలు పెంచేందుకు అవకాశం ఉన్న చెరువుల వద్ద స్థానిక మత్స్యకారుల సహకార సంఘాలకు ముందే సమాచారం అందించి వారి జీవనోపాధి పెరిగేలా చూడాలని చెప్పారు.విబిజి రాంజీ కింద చేపట్టే పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని ,ఈ విషయాలన్నీ స్థానిక గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ కు ,ఇతర ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. అలాగే ఎల్ నినో ప్రభావం వల్ల వచ్చే జూన్ వరకు వర్షాలు వచ్చే అవకాశం లేనందున భూగర్భ జలాలు తగ్గిపోయి ప్రజలు ,పశువులు నీటి కోసం ఇబ్బంది పడకుండా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని, ఇందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ,తెలంగాణ జలసిరిలో కూడా ఇలాంటి పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత నీయడం జరుగుతున్నదని, కమ్యూనిటీ సోక్ పిట్లు ,మ్యాజిక్ సోక్ పిట్లకు యుద్ధ ప్రాతిపదికన ప్రణాళిక రూపొందించుకుని చేపట్టాలని చెప్పారు. విబిజి రామ్ జి కింద చేపట్టే పనులపై మాస్టర్ ట్రైనర్ ఓరెంటేషన్ వర్క్ షాప్ కు హాజరైన అధికారులకు తెలియజేశారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిపిఓ తరుణ్ చక్రవర్తి, డిఎఫ్ఓ రాజశేఖర్, ఈ సమావేశానికి హాజరయ్యారు.

# రీ-సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10:**



రీ -సర్వే ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీ-సర్వే ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వి రాములు మాట్లాడుతూ, రీ-సర్వేకు సంబంధించిన కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ, వివరాల నమోదు తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి సంబంధించి రికార్డుల హక్కుల నవీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఆర్ఓఆర్ లో వివరాల నవీకరణ చేపట్టేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణిక విధానాల ప్రకారం అన్ని చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రీ-సర్వే ప్రక్రియలో భాగంగా భూ రికార్డుల పరిశీలన, పాత రికార్డులతో నూతన రికార్డుల అనుసంధానం, కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ తదితర అంశాలలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మీ వెంటే మేమున్నాం..!






## --వికలాంగుల బాలుర వసతి గృహంలో సందడి
## -- పిల్లల సమస్యలు తెలుసుకొని చట్టాలపై చైతన్యం నింపిన న్యాయమూర్తి హిమబిందు

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

వికలాంగుల బాలుర కళాశాల వసతి గృహంలో గురువారం నాటి వాతావరణం ఎంతో ప్రత్యేకంగా, ఆత్మీయంగా మారింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి హిమబిందు వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులతో సమయం గడిపి వారిలో కొండంత ధైర్యాన్ని నింపారు.

**-అడుగడుగునా పరిశీలన -- సిబ్బందికి దిశానిర్దేశం..**

హాస్టల్‌లోని ప్రతి మూలన క్షుణ్ణంగా పరిశీలించిన కార్యదర్శి, నిత్యావసర సరుకుల నిల్వలు, తాగునీరు, టాయిలెట్లు, ఆవరణ పరిశుభ్రతను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని, హాస్టల్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**అప్యాయతతో పలకరింపు.. చట్టాలపై చైతన్యం..**

విద్యార్థుల వద్దకు వెళ్లి అప్యాయంగా మాట్లాడిన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి హిమబిందు వారికి అందుతున్న భోజన వసతులు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. "మీరేమీ భయపడాల్సిన అవసరం లేదు, ఏ సమస్య వచ్చినా స్వేచ్ఛగా చెప్పండి" అని ధైర్యం చెప్పారు. ?ఈ సందర్భంగా విద్యార్థులకు తమ చట్టపరమైన హక్కులు, రక్షణలు, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచితంగా లభించే న్యాయ సాయం గురించి అత్యంత సులభమైన రీతిలో వివరించారు. ఆపదలో లేదా అవసరంలో ఉన్నప్పుడు న్యాయ సేవలను ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సీనియర్ అసిస్టెంట్ బాలయ్య, జిల్లా వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ ఆఫీసర్లు నాగిరెడ్డి, సింహాద్రి, పారా లీగల్ వాలంటీర్ శ్రీకాంత్, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మని 2026 - 27 కార్యక్రమం



**మందమర్రి, సెప్టెంబర్ 10 అక్షర కలం:**

పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు హాజరై, విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థి ఎన్నికల్లో ఎన్నికైన ప్రతినిధులకు బ్యాడ్జీలు, శాలువాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన, క్రమశిక్షణ, కర్తవ్య నిర్వహణను పెంపొందించడమే ఇన్వెస్టిచర్ సెర్మనీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో సమాజానికి ఆదర్శవంతమైన నాయకులుగా ఎదగాలంటే చిన్నప్పటి నుంచే నాయకత్వ నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్ రమేష్ మాస్టర్ సేవలను ప్రశంసిస్తూ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. రమేష్, డీన్ కె రవితేజ, ప్రైమరీ ఇంచార్జ్ సునీత, పీపీటీ ఇంచార్జ్ తిరుమల, జోనల్ ఇంచార్జ్ రాజేందర్ పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, జోనల్ ఏజీఎం అరవిందర్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజులు విద్యార్థులను అభినందించి వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం..

**హైదరాబాద్:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపైనా చర్చలు జరిగాయి.

**బీఆర్ఎస్ కుట్రను తిప్పికొట్టారు**

ఈ సందర్భంగా శాసనసభను సజావుగా సాగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసిందని సీఎం రేవంత్ ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకునే వ్యూహం రూపొందించారని విమర్శించారు. అధికారం కోల్పోయినా వారు అహంకారం వీడలేదని మండిపడ్డారు. పోలీసు సిబ్బందిలో కేటీఆర్‌కు తాను కనిపించినట్టు ఉన్నానని, అంత ఆక్రోశంతో వారిపై ఆయన దాడులు చేశారని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులపై అనుచితంగా వ్యవహరించారని, మహిళా అధికారుల ఎదుట చొక్కాలు విప్పి ఇబ్బంది కలిగించారని మండిపడ్డారు. శాసనసభాపతినీ అత్యంత అభ్యంతరకరంగా దూషించారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ఆ పార్టీకి నష్టం చేకూర్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టి ప్రభుత్వానికి అండగా నిలిచారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి అభినందించారు.

**ప్రజలు గమనిస్తున్నారు..**

ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. 'మీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుంది' అని హితవు పలికారు. ఈ సందర్భంగా శాసనసభలో చురుగ్గా పాల్గొని ప్రజా సమస్యలను ప్రస్తావించాలని సూచించారు. అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలని, నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఆదేశించారు. ప్రజలు అప్పగించిన పదవిని సక్రమంగా వినియోగించుకోకపోతే రాజకీయ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

**కులగణనకు తెలంగాణ మోడల్ కావాలి..**

దేశానికి తెలంగాణ చేపట్టిన కులగణన ఒక రోల్ మోడల్‌గా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యేగా మరోసారి గెలవాలని భావించే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే ఓటర్ల జాబితాలో 88 కోట్ల మంది మాత్రమే ఉన్నారని ఆరోపించారు. ఈ లెక్కలతో భారీగా ఓట్లు గల్లంతయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

**వెయ్యి రోజుల పాలనలో ఎన్నో కార్యక్రమాలు..**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు సభ నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. వెయ్యి రోజుల పాలనలో పార్టీ ఎమ్మెల్యేలు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో చేపట్టిన కార్యక్రమాలను దేశంలో ఎక్కడా లేని విధంగా ముందుకు తీసుకెళ్లామని, వాటి ఫలితాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఇదిలా ఉండగా.. సభ్యులందరికీ వెసులుబాటు కల్పించేలా అత్యంత చారిత్రక భవనంలో శాసనమండలి నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్న విషయాన్నీ సమావేశంలో రేవంత్ రెడ్డి ప్రస్తావించారు.



# డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోంది

**ఐదు గ్యారెంటీలను సవ్యంగా అమలు చేస్తున్నాము**

**మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ,¯ కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప - 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
మెదక్ - సంగారెడ్డి - సిద్దిపేట

# పండుగను సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలి....

## - మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం....

## - జిల్లా అధికారులకు మట్టి వినాయక ప్రతిమలు అందించిన కలెక్టర్, ఎస్పీ...

## - జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్...

మెదక్, సెప్టెంబర్ 10(అక్షరకలం)

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు.గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో బావయ్య లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం



వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి వినాయక చవితి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను నిర్వహించాలని తెలిపారు.

### - జిల్లా అధికారులకు మట్టి వినాయక ప్రతిమలు అందించిన కలెక్టర్ ,ఎస్పీ....

సమావేశం అనంతరం జిల్లా అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు గణపతి ప్రతిమలు అందించారు.కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలుపర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు మరియు ఇతర జల వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా జల వనరుల పరిరక్షణకు తోడ్పడటంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చుని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ,రెవిన్యూ గ్రామపంచాయతీ, వైజాగ్ శాఖ, విద్యుత్ , ఫైర్ , ఆర్ అండ్ బి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వివిధ శాఖల అధికారులు, , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి...

## - జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్.....



మెదక్, సెప్టెంబర్ 10(అక్షర కలం)

సెప్టెంబర్ 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ంగ్ ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీస్ గౌరవ వందనం, బందోబస్తు విషయంలో పటిష్ట ఏర్పాట్లు. చేయాలని పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీఓ రమాదేవి, డిఎఫ్ఓ జోజి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డీఓ పిడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి..... - అదనపు కలెక్టర్ నగేష్....



మెదక్, సెప్టెంబర్ 10(అక్షర కలం)

గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ తో కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగానివాళులర్పించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్ర వేసిన గొప్ప మహిళా యోధురాలని అన్నారు. సామాజిక అన్యాయం, జమీందారీ వ్యవస్థ, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ్మ నిరుపేద కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ, ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. విస్నూర్ దేశ్‌ముఖ్ దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చేసిన సాహసోపేతమైన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, రైతాంగ ఉద్యమాల్లో ఆమె పోషించిన పాత్ర మహిళల ధైర్యసాహసాలకు నిదర్శనమని కొనియాడారు.సమాజంలో అసమానతలను తొలగించేందుకు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ టిఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా దేవులపల్లి రాజేందర్ మాదిగ ఎన్నిక

అక్షర కలంసిద్దిపేటసెప్టెంబర్ 10:

ఈరోజు హైదరాబాద్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ రాష్ట్ర అధ్యక్షులు కేదాస్ మోహన్ నాయకత్వంలో ఈరోజు రాష్ట్ర కార్యాలయంలో సిద్దిపేట జిల్లా కమిటీ ఎన్నుకున్నారు.అందులో భాగంగా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నంగునూరు గ్రామానికి చెందిన దేవులపల్లి రాజేందర్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ నేను ఇంతకుముందు



జిల్లా ఉపాధ్యక్షుడిగా జిల్లా అధికార ప్రతినిధిగా కొనసాగాను రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలో చూసా తప్పకుండా ఇచ్చిన కార్యక్రమా లు విజయవంతం చేశారని నా సేవలను నా పనిని గుర్తించి ఈరోజు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ కమిటీ రాష్ట్ర కమిటీ నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది

10 సంవత్సరాల్లో పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని ఘనత బి ఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుంది

అప్పుడు దొడ్డు బియ్యం కాంగ్రెస్ ప్రభుత్వంలో సన్న బియ్యం

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధి

సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

అక్షర కలంసిద్దిపేటసెప్టెంబర్ 10:



తెలంగాణ రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చడమే స్మార్ట్ రేషన్ కార్డు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు.గురువారం సిద్దిపేట పట్టణంలోని 43వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీచేశారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూజల హరికృష్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ప్రజాపాలనలో భాగస్వాములైన పేద మధ్యతరగతి కుటుంబాలకు పూర్తి స్థాయి ఆహార భద్రత కల్పించడానికే ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలను తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా పేదల కడుపు కొట్టారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పారదర్శక సేవలకు శ్రీకారం చుట్టిందని పూజల హరికృష్ణ అన్నారు . ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులతో పాటు ఇతర సంక్షేమ పథకాలు పొందడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు.ఏ ఒక్క నిరుపేదా సంక్షేమానికి దూరం కాకుండా చూసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్, , బొమ్మల యాదగిరి, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి,వాహబ్, పాల్గొన్నారు.

# దళితులను లక్షాధికారులను చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంది

అక్షర కలంసిద్దిపేటసెప్టెంబర్ 10:

నంగునూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూఈ భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన 79 సంవత్సరాలలో మనకు రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దేశంలో ఎక్కడా లేని విధంగా ఏ రాష్ట్రంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని విధంగా 125 అడుగుల విగ్రహాన్ని హైదరాబాద్ నగరం నడిబొడ్డులో ఆయన విగ్రహాన్ని నిలబెట్టి దళితులకు ఎంతో ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత కెసిఆర్ ది మరియు బిఆర్ఎస్ పార్టీది.దళిత బంధు ద్వారా రాష్ట్రంలో ఎంతోమంది దళితులను లక్షాధికారులను చేసిన ఘనత కేసీఆర్ ది బిఆర్ఎస్ పార్టీది.ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ నిధులను ఇచ్చి ఎస్సీలను ఒక ఉన్నత స్థానంలో చూడాలనుకున్నది కేసీఆర్ మా బిఆర్ఎస్ పార్టీ.కాంగ్రెస్ పార్టీ ఎస్సీలకు ఇచ్చిన ఎస్సీ డిక్లరేషన్ హామీలు ఇప్పటివరకు అటక మీద, పేపర్లలో ఉన్నాయి తప్ప రాష్ట్రంలో ఏ ఒక్కరికి పెంచి ఇస్తా అన్న దళిత బందు 12 లక్షల రూపాయలు మరియు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలు 10 రూపాయలు కూడా ఇవ్వని ఘనత మీ కాంగ్రెస్ పార్టీది అలాంటి మీరు ఎస్సీలకు ఏదో ఒరగపెట్టామని చెప్పుకోవడం సిగ్గుమాలిన చర్య



తప్పు మీరు చేసింది. ఏం లేదు మీ పార్టీ ఆదేశాల మేరకు కేసీఆర్ ఫామ్ హౌస్ లో డప్పులతో చావు డప్పు కొడతామని ఎస్సీల పేరుతో ప్రకటించుకొని మీ యొక్క కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్ర నాయకులందరూ రావడం ఆ గ్రామంలోని ప్రజలకు మరియు బిఆర్ఎస్ నాయకులకు నచ్చక ఇచ్చిన హామీలు మరిచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ సీఎం కేసీఆర్ పై కక్ష తో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు వాళ్ళ గ్రామానికి రావడం వలన ఎర్రవెల్లి గ్రామాన్ని శుద్ధి చేసుకున్నారు తప్ప ఏదో దళితుల వచ్చారు అని మాత్రం శుద్ధి చేయలేదు.మీ కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేక దళితుల పేరుచెప్పిడ్రామాలాడుతున్నారు. తప్ప మీరు దళితులకు ఓరగబెట్టింది ఏమీ లేదు అని ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటన్నా హామీ నెరవేర్చారా అని సూటిగా ప్రశ్నించారు.దళితుల పేరు చెప్పుకొని పబ్బం గడుపుతున్నారు తప్ప దళితులకు ఇచ్చిన ఎస్సీ డిక్లరేషన్ ప్రకారం ఏం చేశారో మీయొక్క నిండు అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని మేము హెచ్చరిస్తున్నాం. అలాగే శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కి జరిగిన అన్యాయం గురించి బిఆర్ఎస్ పార్టీ పెద్దలు మరియు బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు నేను అలా మాట్లాడడం తప్పే అని సారీ చెప్పడం జరిగింది.అలాంటి దాన్ని భూతద్దంలో పెట్టి పెద్దదిగా చేసి అసెంబ్లీలో కూడా ఇగ మాకు ఎవరు అడ్డు ఉండకూడదని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ఎమ్మెల్సీలను సభకు రాకుండా సస్పెన్షన్ చేయడం విడ్డూరంగా ఉందని వాపోయారు.కెసిఆర్ ఏర్పాటుచేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయకుండా మరియు ఆ యొక్క భవనముకు తాళం వేసి అంబేద్కర్ ని యావత్ దళిత సమాజాన్ని అవమానపరిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీ కాంగ్రెస్ పార్టీ. దళిత బందుకు జై భీమ్ పాడి ఎస్సీ కార్పొరేషన్కు ఇప్పటివరకు నిధులు కేటాయించకుండా దళితులను చిన్నచూపు చూస్తుంది మీ కాంగ్రెస్ పార్టీ మీ రేవంత్ రెడ్డి ఎవరికి ఎస్సీల మీద ప్రేమ ఉందో ఎవరికి ప్రేమ లేదో రాష్ట్రంలోని ఎస్సీ ప్రజలందరికీ తెలుసు అని ఒక కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎస్సీలకు మాత్రం తెలియకపోవడం విడ్డూరంగా ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంగ కుమార్, తాజా మాజీ ఎంపీటీసీ జాజాల సుమలత చందు, బిఆర్ఎస్వి నంగునూర్ మండల కో ఆర్డినేటర్ తప్పేట పర్శరాములు, సిద్దిపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, నంగునూరు గ్రామ 14వ వార్డు నెంబర్ వానరాశి అనిత చంద్రమౌళి, దేవులపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జై గౌడ్ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర కమిటీ

అక్షర కలం సిద్దిపేట సెప్టెంబర్ 10:

సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మేట గ్రామం గౌడ సంఘం సభ్యుల అందరి సమక్షం ఆధ్వర్యంలోజై గౌడ్ ఉద్యమం తరపున విలేజ్ కమిటీ లు వేయడం జరిగినది.జై గౌడ్ ఉద్యమం నర్మేట గ్రామం అధ్యక్షులు గోనెపల్లి తిరుపతి గౌడ్,ఉపాధ్యక్షులు బోలగం నరసింహులు గౌడ్,జనరల్ సెక్రెటరీ బందారం యాదగిరి గౌడ్,సహాయ కార్యదర్శి వడ్లకొండ రాజు గౌడ్, ప్రచార కార్యదర్శి బందారం నరసింహులు గౌడ్,యూత్ అధ్యక్షులు ధమక్కపల్లి రాజు గౌడ్,యూత్ ఉపాధ్యక్షులు వడ్లకొండ పరశురాం గౌడ్, ప్రధాన కార్యదర్శి పరకాల ప్రశాంత్ గౌడ్, సహాయ కార్యదర్శి దమ్మక్కపల్లి విజయ్ గౌడ్, ప్రచార కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ గౌడ్,జై గౌడ్ ఉద్యమం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గంధపు హరి గౌడ్(హరి తందూరి హోటల్),నెమలి సుభాష్ గౌడ్ (మాజీ సర్పంచ్), ముస్మీర్ పరుశురాం గౌడ్,(జన జాగృతి రిపోర్టర్ ) మహేంద్ర గౌడ్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ ,సమక్షంలో కమిటీలు వేయడం జరిగినది. ఇందుకు సహకరించిన నర్మేట గ్రామం గౌడ సంఘ సభ్యులందరికీ ధన్యవాదాలు జై శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ కి జై గౌడ పెద్దలను గౌరవిస్తూనే యువతకు ప్రాధాన్యత కల్పిస్తే భవిష్యత్తులో గౌడుల అభివృద్ధి, ఐక్యత, రాజకీయ అవకాశాలపై సుదీర్ఘంగా పోరాటాలు చేసి కులంలో ఎక్కువ మందికి చట్టసభల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తూ, గౌడుల సమస్యలను పరిష్కరించే దిశగా పోరాటాలు చేసి మన హక్కులను సాధించుకునే దిశగా ఎక్కువ అవకాశాలు ఉంటాయని జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్, జై గౌడ్ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుండ్రాతి నారాయణ గౌడ్ మహారాష్ట్ర ప్రెసిడెంట్ సిల్వర్ నారాయణ గౌడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెసిడెంట్ చిట్టి బొమ్మ కిషోర్ గౌడ్ తెలంగాణ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గన్నేబోయిన చంద్రం గౌడ్,రాష్ట్ర కమిటీ సభ్యులందరూ కలిసి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది.అన్ని జిల్లాలలో జిల్లా అధ్యక్షులు, యువత అధ్యక్షులను మార్పు చేర్పులు జరిపి ఉద్యమానికి కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి కొత్తవారికి అవకాశం కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుంది. కావున గౌడ పెద్దలు, యువత, మహిళలు, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రచార కమిటీ వివిధ విభాగాలు కమిటీలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాము.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955




# జోహార్ కామ్రేడ్ "చాకలి ఐలమ్మ"

## – తెలంగాణ సాయుధపోరాట నిప్పురవ్వ
## – సిపిఎం రాష్ట్ర సీనియర్ నేత "పి. సోమయ్య"

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం:నైజాం తొత్తు, మధ్య యుగాల భూస్వామ్య వ్యవస్థ ప్రతినిధి, నరరూప రాక్షసుడైన విసునూరు దేశముఖ్ను ఎదిరించిన మట్టి మనిషి చాకలి ఐలమ్మ. 'నీ కాళ్ళు మొక్కుత దొరా! నీ బాంచెన్ దొరా!' అన్న తెలంగాణ రైతు కూలీ బిడ్డలు, ఆ దొరలకు వ్యతిరేకంగా గుతపలు, వడిసెల, తుపాకులతో తిరగబడ్డారు. ఐలమ్మ ఆ మహత్తర తిరుగుబాటుకు స్ఫూర్తి, సంకేతం. ఆంధ్ర మహాసభనాయకత్వంలో ఎర్రజెండా పట్టింది. పోరాడింది. పంటను, భూమిని దక్కించుకుంది. దొరలనెదిరిస్తే కష్టాలు తప్పవని, ప్రాణాలు తీస్తారని ఆమెకు తెలుసు. అయినా, లొంగి బతకడం కన్నా, పోరాడి మరణించటమే మేలనుకుంది.పరమ దుర్మార్గుడు రామచంద్రారెడ్డి. 40 వేల ఎకరాల ఆసామి, 60 గ్రామాలకు అధిపతి. నైజాంకు నమ్మినబంటు. ఇతని కొడుకు బాబుదొర (జగన్మోహన్ రెడ్డి) దుర్మార్గాలకు, ఆగడాలకు పెట్టింది పేరు. చాకలి, మంగలి, చేతివృత్తుల వారు, రైతులు, కూలీలు వీరి పీడనలో పీల్చి పిప్పి చేయబడ్డారు. ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదు. నైజాం రాజు, రజాకార్ల నాయకుడు ఖాశీం రిజ్వీ, భూస్వాముల, దేశముఖి అధికారాలకు, దుర్మార్గాలకు, అత్యాచారాలకు అంతేలేదు. ప్రజల నుంచి కొల్లగొట్టిన సంపదతో భోగలాలస జీవితాలు గడిపేవారు. ఈ పూర్వ రంగంలో పీడించబడిన ఆ మట్టి మనుషుల జీవితాలకు ఆనాడు సంఘం (ఆంధ్ర మహాసభ) ఎర్రజెండా ఆశాకిరణంగా ముందుకొచ్చింది.ఐలమ్మకు స్వంత భూమి లేదు. మల్లంపల్లి భూస్వామి కొండ్రావు దగ్గర నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుంది. కుల వృత్తిమీద వచ్చే మాన్యం గింజలతో పాటు, కౌలు వ్యవసాయం మీద ఆదాయం ఐలమ్మ కుటుంబానికి ఆసరాగా ఉండేది. సంఘం నాయకులు చెప్పే విషయాలన్నీ ఐలమ్మ జాగ్రత్తగా వినేది. గ్రామంలో జరుగుతున్న విషయాలన్నీ అర్థం చేసుకునేది. పాలకుర్తిలో సంఘం కార్యక్రమాలకు ఐలమ్మ ఇల్లే కేంద్రమైంది. భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభకు ఐలమ్మ తన కుటుంబ సభ్యులతో పాటు వెళ్లి పాల్గొన్నది. మహాసభ ఐలమ్మలో చైతన్యాన్ని రగిలించింది.ఇంత కాలం తమకు ఎదురు లేకుండా విర్రవీగుతున్న దేశముఖ్, భూస్వామ్య దోపిడీగాళ్ళకు సంఘం పేరుతో పేదలు సంఘటితం కావడం, ఎదురు తిరగటం వారిలో కలవరం లేపాయి. "సంఘాన్ని" విచ్ఛిన్నం చేయాలని దేశముఖ్ రామచంద్రారెడ్డి తన ప్రయత్నాలు ప్రారంభించాడు. తన కింద వందమందికి పైగా ప్రయివేటు సైన్యాన్ని, గూండాలను పోగేసుకున్నాడు. యీ గూండాల దాడులను ప్రతిఘటించడం కోసం గ్రామాలలో పేదలు ఆంధ్ర మహాసభ శాఖలు ఏర్పాటు చేసుకోవడం ప్రారంభించారు పోలీస్ పటేల్ దాడి

పాలకుర్తిలో వీరపనేని శేషగిరిరావు దేశముఖ్ రామచంద్రారెడ్డికి నమ్మినబంటు. ఈయన పోలీస్ పటేల్. ఎప్పటికప్పుడు పాలకుర్తి విషయాలన్నీ దేశముఖ్కు చేరవేస్తూ, సంఘం బలపడకుండా ప్రయత్నాలు ప్రారంభించాడు. దేశముఖ్ తన పొలంలో ఐలమ్మ కుటుంబం అంతా వచ్చి పని చేయాలని మనుషులను పంపించాడు. ఐలమ్మ వ్యతిరేకించింది. ఐలమ్మ తన మాట వినడం లేదని, కమ్యూనిస్టులకు, సంఘం కార్యకర్తలకు తన ఇంట్లో ఆశ్రయం కల్పిస్తున్నదని, సంఘాన్ని నామ రూపాలు లేకుండా చేయమని దేశముఖ్ రామచంద్రారెడ్డి ఆజ్ఞాపించాడు. ఐలమ్మ ఇంటిపైకి శేషగిరిరావు తన గూండాలను పంపించాడు. ఐలమ్మ ప్రతిఘటించింది. గూండాలు ఇంటిని లూటీచేసి భీభత్సం సృష్టించారు. సజ్జలు, జొన్నలు, యింట్లో సామాగ్రి అంతా ఎత్తుకెళ్ళారు. నిరుపేద అయిన ఐలమ్మ లొంగిపోలేదు. సంఘం అండతో మరింత పట్టుదల, కసితో దొరకు ఎదురు నిలబడింది. పోలీసుల చిత్రహింసలు పాలకుర్తిలో శివరాత్రి ఘనంగా జరుగుతుంది. ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సవాలకు ఉత్సవాలలో సభ జరపాలని సంఘం నాయకులు నిర్ణయించారు. ఎట్టి పరిస్థితులలోనూ సభజరగనీయవద్దని, అడ్డుకోవాలని, వచ్చిన నాయకులపై దాడి చేయాలని, అవసరమైతే హత్య చేయాలని దేశముఖ్ తన గూండాలను పాలకుర్తికి పంపించాడు. ఐలమ్మ ఇంటి ముందు



సభ జరుగుతున్నది. దేశముఖ్ గూండాలు గొంగళ్ళు కప్పుకొని వాటి మాటున గొడ్డళ్ళు, కత్తులు పట్టుకొని సభకు వచ్చారు. యీ ప్రమాదాన్ని పసిగట్టిన ఐలమ్మ భర్త నర్సయ్య, కొడుకులు సోమయ్య, లచ్చయ్యలు వెళ్ళి గూండాలను అడ్డుకున్నారు. జనం గూండాలను తరిమికొట్టారు. గూండాలలో ఒకతనికి దెబ్బలు బాగా తగిలాయి. రెచ్చిపోయిన దేశముఖ్ పోలీసులతో ఐలమ్మ భర్త, ఇద్దరు కొడుకులతో పాటు, గ్రామంలోని సంఘం కార్యకర్తలందరిపైన హత్యాయత్నం కేసులు బనాయించాడు. పోలీసుల చిత్రహింసలకు, కొట్టిన దెబ్బలకు ఐలమ్మ భర్త నర్సయ్య చెయ్యి పడిపోయింది. ఇద్దరు కొడుకులు పోలీసుల దెబ్బలకు తల్లడిల్లిపోయారు. దీర్ఘకాలం ఐలమ్మ కుటుంబం అంతా కోర్టుల చుట్టూ తిరిగింది. భూమి కోసం దేశముఖ్ రామచంద్రారెడ్డి దృష్టి మొత్తం ఐలమ్మ కుటుంబంపై పడింది. పోలీసుల చిత్రహింసలకు, కేసులకు కూడా ఐలమ్మ లొంగకపోవడంతో మరింత రెచ్చిపోయాడు. ఐలమ్మ కౌలుకు తీసుకున్న భూమిని కాజేయాలని రామచంద్రారెడ్డి ప్లాన్ వేశాడు. గత ఇరవై ఏండ్లుగా ఐలమ్మ సాగుచేస్తున్న మల్లంపల్లి భూస్వామి కొండ్రావు భూమిని తనకు కౌలుకు యిచ్చినట్లు కొండ్రావుతో కాగితం వ్రాయించుకున్నాడు. యీ దెబ్బతో ఐలమ్మ తన చేతుల్లోకి వస్తుందని దేశముఖ్ భావించాడు. అప్పటికే భూమిలో ఐలమ్మ సాగు చేసుకున్న పంట వుంది. ఆ పంటను కాజేయాలని కుట్ర చేసాడు. ఐలమ్మ బెదరలేదు. రెవెన్యూ, పోలీసు అధికారులందర్నీ కలిసింది. తన గోడునంతా చెప్పుకున్నది. అరవై ఊళ్ళ ఆసామి, నైజాం నమ్మిన బంటు రామచంద్రారెడ్డి కావడంతో, ఏ ఒక్క అధికారీ ఐలమ్మ పక్షాన నిలబడలేదు. పంటను కోసుకొని రావాలని దేశముఖ్ తన గూండాలను ఐలమ్మ పొలం పైకి పంపించాడు. పండిన ధాన్యాన్ని దే శముఖ్ అపహరించకుండా ఐలమ్మ ఇంటికి చేర్చాలని సంఘం ఆదేశించింది. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, కట్కూరి రామచంద్రారెడ్డి, చకిలం యాదగిరిరావు, ధర్మ భిక్షం తదితర కార్యకర్తలు పాలకుర్తికి చేరుకొని, ఐలమ్మ పొలంలోకి దిగారు. ఐలమ్మ సంఘం నాయకులతో కలిసి దేశముఖ్ గూండాలను ఎదుర్కొన్నది. నాలుగు వందల మంది దేశముఖ్ గూండాలను సంఘం కార్యకర్తలు తరిమికొట్టారు. బిత్తరపోయిన గూండాలు పారిపోయారు. "ఈ భూమి నాది... పండించిన పంట నాది... తీసుకెళ్ళడానికి దొరెవ్వడు?... నా ప్రాణం పోయాకే యీ పంట, భూమి దక్కించుకోండి" అంటూ ఐలమ్మ మాటలను తూటాలుగా పేల్చింది. సంఘం నాయకులు పండించిన ధాన్యాన్ని, మోపులు కట్టి, కొట్టి ఐలమ్మ ఇంటికి చేర్చారు. రామచంద్రారెడ్డి ఆగ్రహంతో ఊగిపోయాడు. జరిగిన పరిణామాలను జీర్ణించుకోలేకపోయాడు. పోలీసులను పురమాయించాడు. "ధాన్యాన్ని నా ఇంటికి తేండి. సంఘం నాయకులను చావగొట్టండి" అని హుకుం జారీచేశాడు. తన పొలంపై దాడిచేసి

కమ్యూనిస్టులు ధాన్యాన్ని దొంగతనంగా తీసుకెళ్ళారని పోలీసులతో కుమ్మక్కై కేసు బనాయించాడు. సంఘం నాయకులు భీమిరెడ్డి నర్సింహారెడ్డి తదితరులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. మూత్రం తాగించారు. తలల్ని వంట పొయ్యిలో పెట్టారు. ఆసనాల్లో కారం చల్లారు. యీ చిత్రహింసల్ని, తప్పుడు కేసుల్ని ఆంధ్ర మహాసభ తీవ్రంగా ఖండించింది. ఐలమ్మ భూ పోరాటం మొత్తం తెలంగాణ నైజాం సంస్థానంలో భూ పోరాటాలకు ఊపునిచ్చింది. పోరాటాలు విస్తృతమయ్యాయి. అజ్ఞాతంలో ఉన్న నాయకులకు



అన్నం పెట్టేందుకు ఐలమ్మ పడరాని పాట్లు పడ్డది. గంపల్లో తీసుకెళితే పోలీసులు పట్టుకుంటారని చాకలి బట్టల మూటల్లో అన్నం తీసుకెళ్ళి కమ్యూనిస్టు దళాలకు పెట్టింది. సాహసం, ధైర్యం ఐలమ్మ ఊపిరి. ఐలమ్మ భూ వివాదంలో ఓటమి పాలైన దేశముఖ్ రామచంద్రారెడ్డి పాలకుర్తిపై అనేకసార్లు దాడులు జరిపించాడు. బాబు దొర పోలీసులతో ఐలమ్మ ఇంటికొచ్చి "కమ్యూనిస్టులకు ఎందుకు సాయం చేస్తున్నావు" అని ప్రశ్నించాడు. ఐలమ్మ బెదరలేదు. రోకలి బండను అందుకున్నది. బాబు దొర తోక ముడిచాడు. రజాకార్ల దాడులు సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతంగా జరుగుతున్న యీ కాలంలోనే ఐలమ్మ ఇంటి మీద రజాకార్లు, దేశముఖ్ గూండాలు దాడి చేశారు. ఇంటికి నిప్పు పెట్టారు. గాబులు, కుండలు, కాగులు పగులగొట్టారు. ధాన్యాన్ని దోచుకున్నారు. ఐలమ్మ కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఐలమ్మ బిడ్డ సోమనర్సమ్మ దుర్మార్గులకు దొరికింది. రజాకార్లు సోమనర్సమ్మను ఆగం చేశారు. ఈ పోరాటంలో ఐలమ్మ కుటుంబం చెల్లాచెదురైంది. అష్ట కష్టాలు పడ్డది. అయినా ఐలమ్మ ధైర్యంగానే నిలబడ్డది. ఐలమ్మ ఇంటిపై రజాకార్ల దాడి అనంతరం పాలకుర్తి ప్రజలు ఆగ్రహంతో పోలీస్ పటేల్ శేషగిరిరావు ఇంటిపై దాడి చేసి కూల్చివేశారు. భూస్వామి వీరారెడ్డి ఇంటిని ధ్వంసం చేశారు. ఆంధ్ర మహాసభఈ ఘటనల్లో కీలకపాత్ర వహించింది. ప్రజలు నూతనోత్తేజంతో విసునూరు, కడవెండి గడీలపై దాడి చేశారు. కడవెండిలో ప్రజలపై విస్నూరు దొర గూండాలు, నైజాం రజాకార్లు జరిపిన కాల్పుల్లో 1946 జూలై 4న దొడ్డి కొమరయ్య ప్రాణాలు కోల్పోయి అమరుడైనాడు.

ఐలమ్మ భూమి కోసం, నమ్మిన ఆశయం కోసం ఆంధ్ర మహాసభ నాయకత్వంలో పోరాడింది. ఎన్ని కష్టాలు వచ్చినా చలించలేదు. ఎర్ర జెండాను ఎత్తుకున్నది. 1985 సెప్టెంబర్ 10న పాలకుర్తిలో తన మనుమరాలి ఇంట్లో మరణించింది. ఆ విప్లవమూర్తి, పోరు తల్లికి విప్లవ జోహార్లు.

# అంగన్వాడీ కేంద్రానికి డిజిటల్ టీవీ



**అక్షర కలం/ ఖమ్మం నగరం :**

ఖమ్మం: ఖమ్మం జిల్లా ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 11వ డివిజన్ కవిరాజ్ నగర్ రోడ్ నెం.12లోని అంగన్వాడీ సెంటర్-2కు డిజిటల్ టీవీని అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు బయన్న బాబు అందించిన టీవీని మాజీ కార్పొరేటర్ సరిపూడి రమాదేవి ప్రారంభించారు. టీవీకి అవసరమైన మెటీరియల్, వైఫై సదుపాయాన్ని కొనిదెన శ్రీనివాసరావు సొంత నిధులతో సమకూర్చారు. విద్యా వీడియోలు, విజ్ఞాన కార్యక్రమాల ద్వారా చిన్నారులకు బోధనను మరింత ఆసక్తికరంగా అందించేందుకు డిజిటల్ టీవీ ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర పద్మజారెడ్డి, అంగన్వాడీ టీచర్ నాగమణి, కొల్లి మాధవి, సరిపూడి వెంకటేశ్వర్లు, అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్ కోశాధికారిగా పిన్ని సత్యనారాయణ

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**



ఖమ్మం ప్రెస్ క్లబ్ కోశాధికారిగా సీనియర్ జర్నలిస్ట్ పిన్ని సత్యనారాయణ(మన తెలంగాణ) ఎన్నికైనట్లు టియూడబ్ల్యూజె (ఐజెయూ ) ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శీలం శ్రీనివాస్ తెలిపారు. గురువారం జరిగిన కమిటీ ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు తెలిపారు. ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు కమిటీ పని చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ గా సత్యనారాయణ అందరికీ సుపరిచితులని తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.

# 12వ వార్డులో మొక్కలను పంపిణీ చేసిన ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్.



**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి :-**

ఇల్లందు పట్టణంలోని 12వ వార్డులో అవార్డు కౌన్సిలర్ రంప రమ్య జాన్సన్ ఆధ్వర్యంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణమిత్ర డానియల్ పర్యావరణ పరిరక్షణ లో భాగంగా గురువారం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్రా డానియేల్ తో పాటు మున్సిపల్ కమిషనర్ జి. సందీప్, 12వ వార్డు కౌన్సిలర్ రంప రమ్య జాన్సంగ్ పాల్గొని ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్రా డానియేల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించవచ్చని తెలిపారు. కమిషనర్ జి. సందీప్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు కూడా మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. 12వ వార్డు కౌన్సిలర్ రంప రమ్య జాన్సంగ్ మాట్లాడుతూ వార్డులో పచ్చదనం పెంచేందుకు ప్రజల సహకారంతో మరిన్ని మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని బాధ్యతగా సంరక్షించాలని ఆమె కోరారు. పచ్చని చెట్ల ద్వారా నీడను ఇవ్వడమే కాకుండా చెట్ల ద్వారా మంచి ఆక్సిజన్తో కుటుంబమంతా ఆరోగ్యం గ ఉంటారని తెలిపారు. కుటుంబంలోని సభ్యుల పుట్టినరోజు సందర్భంగానైనా మొక్కలు నాటి తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పరచాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో దారుణం.. భార్యను చంపి, శవాన్ని కారులో వేసుకుని..





**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం: ఖమ్మం నగరంలో దారుణ ఘటన వెలుగు చూసంది. ఓ వ్యక్తి తన భార్యను గొంతు నులిమి చంపి, కారులోనే ఆమె మృతదేహాన్ని తీసుకుని, ఓ చోట కారును పార్క్ చేసి, ఘటనను స్నేహితునికి ఫోన్ ద్వారా సమాచారం అందించిన ఉదంతం తీవ్ర కలకలం రేపింది. ఫోన్ సిగ్నల్ ద్వారా ఖమ్మం పోలీసులు నిందితుని ఆచూకీని పసిగట్టి అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.పోలీసు వర్గాల కథనం ప్రకారం వివరాల్లోకి వెడితే.. ఇల్లెందుకు చెందిన మేడిపల్లి విద్యాసాగర్ (44) అనే వ్యక్తి కారు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా మొదటి భార్యతో విడాకులు తీసుకుని, ఆ తర్వాత తనకు పరిచయమైన చిన్నబోయిన రేణుక అనే మహిళను నాలుగు నెలల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఖమ్మంలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఏరియాలోనే రేణుకతో కలిసి నివాసముంటున్నాడు.

### కారులో నిర్జీవంగా రేణుక

అయితే రేణుకకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానం విద్యాసాగర్ లో కలిగింది. దీంతో ఇరువురి మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలోనే విద్యాసాగర్ నిన్న సాయంత్రం వేళ తన రెండో భార్య రేణుకను తన కారులో ఎక్కించుకుని బయటకు తీసుకువెళ్లాడు. కారులో ప్రయాణిస్తున్న సమయంలోనే ఇరువురి మధ్య ఘర్షణ ప్రారంభమైంది. ఈ పరిణామాల్లోనే విద్యాసాగర్ రేణుక గొంతు నులిమి చంపేశాడు.తాను తన భార్యను చంపినట్లు విద్యాసాగర్ ఇల్లెందులోని తన స్నేహితునికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. తాను కూడా చనిపోతున్నట్లు తెలిపాడు. దీంతో విద్యాసాగర్ స్నేహితుడు కలవరపడి రఘునాథపాలెం సీఐకి ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో సీఐ అప్రమత్తమై విద్యాసాగర్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతని ఆచూకీని కనిపెట్టారు. గత రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఖమ్మం-ఇల్లెందు రోడ్డులోని ప్రగతి స్కూల్ దగ్గర విద్యాసాగర్ ఉన్నట్లు గ్రహించారు.

### నిందితుడు విద్యాసాగర్

విద్యాసాగర్ ఫోన్ నెంబర్ కు పోలీసులు రింగ్ చేసి, ప్రగతి స్కూల్ పక్కనే నిలిపి ఉంచిన ఓ కారు సమీపాన అతను ఉన్నట్లు గ్రహించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. విద్యాసాగర్ గొంతు నులిమి చంపిన అతని భార్య రేణుక మృతదేహం గల కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిందితుడు ఖమ్మం అర్బన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అయితే రేణుకను విద్యాసాగర్ ఎక్కడ చంపాడు? చంపిన తర్వాత ఆమె మృతదేహంతో ఎక్కడి నుంచి ఖమ్మం వరకు ఎంత దూరం ప్రయాణించాడు? వంటి అనేక ప్రశ్నలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఖమ్మం నగరంలో తీవ్ర కలకలం రేపింది. పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో "నిజం గెలిచింది" పేరుతో కొవ్వొత్తుల ప్రదర్శన.

**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి :-**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నేటికి మూడేళ్లు అయిన సందర్భంగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్ పిలుపుమేరకు. గురువారం ఇల్లందులో నిజం గెలిచింది అనే పేరుతో సాయంత్రం 6 గంటలకు ఇల్లందు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇల్లందు నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ.వంశీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి చరిత్రలో ఆ రోజుని బ్లాక్ డే గా అభివర్ణించారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బాబు అక్రమ అరెస్టు తర్వాత జరిగినా ఎలక్షన్లలో తెలుగుదేశం పార్టీ,



కూటమి ప్రభుత్వం ఏర్పడి ప్రజారంజకమైన, పాలనను కొనసాగిస్తున్నారని, చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమం అని తెలుగు ప్రజలందరూ నమ్మి కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారని, ఇతర పార్టీలకు ప్రతిపక్ష హోదా కూడా కల్పించకుండా చిత్తుచిత్తుగా ఓడించి వారికి బుద్ధి వచ్చేలా తమ ఓట్లతో తీర్పునిచ్చారని ముద్రగడ. వంశీ పేర్కొన్నారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంది.రవి, లింగయ్య యాదవ్, ప్రకాష్, చెలిమెల.బాబు, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య పట్టణ అధ్యక్షులు దాసరి గోపాలకృష్ణ, గొగ్గల రాజేష్, శ్రీవేద్, అప్పాల.రాకేష్, భూసాని.నవీన్ కుమార్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.




# పంచాంగల్ తండాలో నూతన బోరువెల్ తవ్వకం విజయవంతం

## ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో పనులు.. సమృద్ధిగా లభించిన నీరు

**గండీడ్, సెప్టెంబర్ 10. అక్షర కలం:**

గండీడ్ మండలం పంచాంగల్ తండా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన నూతన బోరువెల్ తవ్వకం పనులు గురువారం విజయవంతంగా పూర్తయ్యాయి. బోరువెల్ తవ్వకంలో సమృద్ధిగా నీరు లభించడంతో తండావాసుల్లో ఆనందం వెల్లివిరిసింది. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నూతన



బోరువెల్ కోసం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులు కేటాయించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. తండా ప్రజల నీటి సమస్యను గుర్తించి ప్రత్యేక చొరవ చూపిన బీజేపీ రాష్ట్ర నాయకులు డా. వెన్న ఈశ్వరప్పకు కూడా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. బోరువెల్‌లో సమృద్ధిగా నీరు పడటంతో భవిష్యత్తులో తాగునీటి సమస్యకు కొంతమేర పరిష్కారం లభించనుందని తండావాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వారు కోరారు. పాల్గొన్న నాయకులు: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్, మాజీ మండల అధ్యక్షులు ప్రభునాయక్, మైపాల్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రఘుమా, మాజీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల బీజేపీ నాయకులు కృష్ణ, తోక కృష్ణ, పెంట్య నాయక్, మాజీ సర్పంచ్ రాజునాయక్, వార్డు సభ్యులు హన్మిబాయి, గేమ్య నాయక్, లాల్య నాయక్, రాధిక, నాయకులు హాజ్య నాయక్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

### మహమ్మదాబాద్‌లో ఘనంగా వర్ధంతి కార్యక్రమం.. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు





**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 10. అక్షర కలం:**

తెలంగాణ సాయుధ పోరాటంలో అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ సేవలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని మహమ్మదాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కే.ఎం. నారాయణ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమెకు ఘన నివాళులర్పించారు. అనంతరం కే.ఎం. నారాయణ మాట్లాడుతూ.. భూస్వామ్య, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని అన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐలమ్మ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాలని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పలువురి పాల్గొనడం ఈ కార్యక్రమంలో ఉమ్మడి గండేడ్ మండల పీఏసీఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జె. రాంలాల్, ఉప సర్పంచ్ పవన్ కుమార్, మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా, పీఏసీఎస్ డైరెక్టర్ హెచ్. ముకుందం, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుప్త అనంతయ్య, పెద్దతండా సర్పంచ్ రాకేష్, రజక సంఘం మండల అధ్యక్షుడు సి. రాములు, గ్రామ అధ్యక్షుడు వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు. పలువురు సర్పంచులు, గ్రామస్థులు, యువకులు, రజక సంఘం నాయకులు కార్యక్రమంలో పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

**విద్యలో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం**

**మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కేటీ దొడ్డి మండలంలోని కస్తూర్బా గాంధీ




బాలికల విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పాత ప్రశ్న పత్రాలను పునఃశ్చరణ చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఖాన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికతో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. గతేడాది ఫలితాలపై ఆరా తీసి ఈసారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే కాక అత్యధిక విద్యార్థులు 500కు పైగా మార్కులు పొందాలని ఆకాంక్షించారు. త్వరలో జరగబోయే ఎస్ఏ1 పరీక్షల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటాలని సూచించారు. విద్యార్థుల దినచర్యను తెలుసుకొని వారికి విద్యాలయంలో కల్పించిన మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. వంట, స్టోర్ గదులను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కేజీబీవీకి సంబంధించిన హాజరు, ఇతర రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం.

**ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించడమే నిజమైన నివాళి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

భూమి కోసం, భుక్తి కోసం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించడమే ఆమెకు నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ వద్ద బిసి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి కలెక్టర్ తో పాటు ఇతర అధికారులు, రజక సంఘం నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు



లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1940వ దశకంలో తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటంలో ఐలమ్మ ధైర్య సాహసాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తాయన్నారు. అప్పుడు పోరాటం చేసిన వారిలో ఐలమ్మ లాంటి చాలా కొద్ది మంది మహిళలు ఉన్నప్పటికీ ఆర్మీ లాంటి గేరిల్ల దళాలను ఏర్పాటు చేసి దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పని చేశారన్నారు. ఐలమ్మ జీవిత చరిత్ర భవిష్యత్తు తరాలకు కూడా స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆమె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ సమాజానికి ఐలమ్మ చేసిన సేవలకు గుర్తుగా కోఠి ఉమెన్స్ కాలేజీకి ఆమె పేరును పెట్టడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పలువురు వక్తలు కూడా మాట్లాడుతూ ఐలమ్మ ఘనతలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, బీసీ అభివృద్ధి శాఖ అధికారి అక్బర్ పాషా, బీసీ, రజక సంఘాల నేతలు, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు ఉచిత ఛాతి ఎక్స్ రే...

**గద్వాల:**



ప్రభుత్వ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏ టిబి క్షయ వ్యాధి నివారణ శాఖ వారి ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జోగులాంబ గద్వాల జిల్లా వారి సహకారంతో సీనియర్ సిటిజన్స్ మరియు వయోవృద్ధుల కోసం ఉచిత ఛాతి ఎక్స్- రే నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సెకండ్ రైల్వే గేట్ సమీపంలోని ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ నందు నిర్వహించిన ఈ శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జోగులాంబ గద్వాల జిల్లా చైర్మన్ శ్రీ సంగాల అయ్యపు రెడ్డి ప్రారంభించారులి. ఈ సందర్భంగా అయ్యపు రెడ్డి మాట్లాడుతూ, వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా ఛాతి సంబంధిత సమస్యలు, క్షయవ్యాధిలి వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించేందుకు ఎక్స్ - రే పరీక్షలులి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. వయోవృద్ధులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో దాదాపు 30 మంది సీనియర్ సిటిజన్స్ మరియు వయోవృద్ధులకు ఉచితంగా ఛాతి ఎక్స్ - రే పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవల కోసం సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో లిఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యనిర్వాక సభ్యులు జి.గంగాధర్ గౌడ్, మహేష్ నాయుడు మరియు వైద్య సిబ్బంది ఆర్.కిరణ్ కుమార్ ఆరోగ్య సందర్శకులు, కె.వెంకటేష్ జిల్లా కార్యక్రమ సమన్వయకర్త, పి.జయరాజు సమాజ సమీకర్త, ఎం.ఉదయ్ ఎక్స్-రే సాంకేతిక నిపుణులు పాల్గొని సేవలు అందించారు.

## గద్వాల నియోజకవర్గ రైతాంగానికి గొప్ప శుభవార్త...

**గుడ్డెందొడ్డి రిజర్వాయర్ 1.9 టీఎంసీ నుండి 15 టీఎంసీల సమర్థ్యం పెంపును జీవో కాపీని నీటిపారుదల శాఖ మంత్రివర్యులు గద్వాల ఎమ్మెల్యేకి అందజేశారు.**

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

ఈరోజు హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ నందు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గుడ్డెందొడ్డి రిజర్వాయర్ 1.9 టీఎంసీ నుండి 15 టీఎంసీల సమర్థ్యం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి జీవో కాపీని గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.గద్వాల నియోజకవర్గ



రైతాంగం ప్రజల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని. సీఎం రేవంత్ రెడ్డి గారు క్యాబినెట్ సమావేశంలో ప్రత్యేకంగా గద్వాల నియోజకవర్గానికి సంబంధించిన నీటిపారుదల గట్టు ఎత్తిపోతల పథకం, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లకు నిధులు కేటాయించడం చాలా సంతోషకరమైన విషయం రైతాంగానికి శాశ్వతమైన నీటి సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించడం జరిగిందని. గద్వాల నియోజకవర్గం రైతులకు రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించే విధంగా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయడం రైతాంగానికి ఎంతో మేలు చేసిన విధంగా ఉన్నదని తెలిపారు. భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గం కృషి చేయాలని గద్వాల నియోజకవర్గం రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గారికి, మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి, జూపల్లి కృష్ణారావు గారికి గద్వాల నియోజకవర్గ ప్రజల తరపున రైతాంగం తరపున హృదయపూర్వక ప్రత్యేకమైన ధన్యవాదాల ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు ఆలూరు రామయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ మున్సిపల్‌లో కో-ఆప్షన్ ఎన్నికకు నేతల నిర్లక్ష్యమే కారణమా?

**ఏప్రిల్‌లోనే నామినేషన్ల ప్రక్రియ పూర్తి.. నెలలు గడుస్తున్నా ఎన్నికకు నో క్లారిటీ**

**నలుగురు సభ్యుల ఎంపికపై అధికార పార్టీలో ఏకాభిప్రాయం కుదరలేదా?**

**రాజకీయ సర్దుబాట్ల కోసం ఎన్నికను జాప్యం..? చేస్తున్నారనే ఆరోపణలు**

**అభ్యర్థుల ఎదురు చూపులు..**

**అక్షర కలం నాగర్‌కర్నూల్ ప్రతినిధి:**

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. నలుగురు కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక కోసం అధికారులు నోటిఫికేషన్ జారీ చేసి, నామినేషన్ల ప్రక్రియను ఏప్రిల్ నెలలోనే పూర్తి చేశారు. మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసి, తమకు అవకాశం లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే నామినేషన్ల ప్రక్రియ పూర్తయి నెలలు గడుస్తున్నా.. ఎన్నిక నిర్వహణకు సంబంధించి మాత్రం ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఆశావహుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**24 మంది కౌన్సిలర్లు.. నలుగురు కో-ఆప్షన్ సభ్యులు**

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో 18 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఉండగా.. ఆరుగురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీలో నలుగురు కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. ఇందుకోసం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసి, అర్హులైన ఆశావహుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు కో-ఆప్షన్ సభ్యత్వం కోసం నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ పరిశీలన కూడా పూర్తయింది. సాధారణంగా నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నిక నిర్వహించి సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం నామినేషన్లు దాఖలు చేసి నెలలు గడుస్తున్నా ఎన్నిక తేదీ ఖరారు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో అసలు ఎన్నిక ఎందుకు ఆలస్యమవుతోందన్న ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

**అధికార పార్టీలో ఏకాభిప్రాయం లేదా?**

కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదనే ప్రచారం జోరుగా సాగుతోంది. నలుగురు స్థానాలకు పలువురు ఆశావహులు పోటీ పడుతుండటంతో ఎవరికి అవకాశం కల్పించాలనే అంశంపై నేతల మధ్య చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తమ అనుచరులకు పదవులు ఇప్పించేందుకు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.అంతే కాకుండా స్థానిక రాజకీయ సమీకరణాలు, నేతల మధ్య సర్దుబాట్లు పూర్తయ్యే వరకు కో-ఆప్షన్ ఎన్నికను ముందుకు తీసుకెళ్లడం లేదనే ప్రచారం కూడా ఉంది. అయితే ఎన్నిక జాప్యానికి అసలు కారణం ఏమిటన్న దానిపై అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

**ఆశావహుల్లో పెరుగుతున్న అసంతృప్తి**

కో-ఆప్షన్ సభ్యత్వం కోసం నామినేషన్లు దాఖలు చేసిన ఆశావహులు ఎన్నిక ఎప్పుడు జరుగుతుందో తెలియక ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ పూర్తయిందని, తదుపరి ఎన్నిక నిర్వహించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని వారు పేర్కొంటున్నారు. రాజకీయ నాయకుల నిర్ణయాల కోసం ఎన్నికను జాప్యం చేయకుండా.. అధికారులు నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ఆశావహులు కోరుతున్నారు. మరోవైపు ఇప్పటికే రెండు సమావేశాలు పూర్తయినప్పటికీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికపై స్పష్టత రాకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఎన్నిక తేదీని ఎప్పుడు ప్రకటిస్తారు? నలుగురు సభ్యులను ఎప్పుడు ఎన్నుకుంటారు? అనే అంశాలపై మున్సిపాలిటీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**జాప్యానికి తెరపడేది ఎప్పుడు?**

మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఇక ఎన్నిక నిర్వహణపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ సర్దుబాట్లే ఎన్నికకు అడ్డంకిగా మారాయా? అధికార పార్టీలో అభ్యర్థుల ఎంపికపై ఏకాభిప్రాయం కుదరలేదనీ ప్రచారం జరుగుతుంది . నలుగురు కో-ఆప్షన్ సభ్యుల కోసం ఎనిమిది మంది ఆశావహులు ఎదురుచూస్తున్న నేపథ్యంలో.. ఎన్నిక ప్రక్రియకు ఎప్పుడు తెరపడుతుందన్నదే ప్రస్తుతం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో హాట్‌టాపిక్‌గా మారింది. అధికారులు ఎన్నిక తేదీని ఎప్పుడు ప్రకటిస్తారు? రాజకీయ నేతలు ఎప్పుడు తుది నిర్ణయం తీసుకుంటారు? కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికపై ఎప్పుడు స్పష్టత వస్తుంది? అన్నది వేచి చూడాల్సిందే.



# కట్కాపూర్ లో పోషణ మాసోత్సవాలు

**రాయికల్ సెప్టెంబర్ 10 (అక్షర కలం):**



పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాయికల్ మండలం కట్కాపూర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను ఐసీడీఎస్ సూపర్వైజర్ అనూహ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ గర్భిణీలు, బాలింతలు,చిన్నపిల్లలు తీసుకోవాల్సిన సమతుల్య పోషకాహారం దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. స్కూల్ పిల్లలకు ఆహారం సంబంధిత క్విజ్ ప్రోగ్రాం జరిపారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా మగవారి వంటల పోటీలు నిర్వహించగ ఈ పోటీల్లో పడాల తిరుపతి , టీచర్స్ అనిల్, రాజేందర్ మరియు గ్రామస్తులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రాధ, సంధ్య, మెడికల్ డిపార్ట్మెంట్ స్టాప్, ఏంపియుపిఎస్ స్టాఫ్, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు

### .....జగిత్యాల జిల్లాలో కంప్యూటర్ ఆపరేటర్ల సామూహిక సెలవులు

**రాయికల్ సెప్టెంబర్ 10(అక్షర కలం):**

జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన పంచాయతీ రాజ్ శాఖ ఈ -పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో విధులకు హాజరయ్యేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాల కంప్యూటర్ ఆపరేటర్లు సామూహిక సెలవులు పెట్టి తమ నిరసనను తెలియజేశారు. సంబంధిత మండల



కార్యాలయాల్లో ఎంపీడీఓలకు సామూహిక సెలవు పత్రాలను సమర్పించారు. ఐదు నెలలుగా జీతాలు లేక కుటుంబాలను పోషించుకోవడం, రోజువారీ ఖర్చులు నిర్వహించడం, విధులకు రాకపోకలు సాగించడం కూడా కష్టంగా మారిందని కంప్యూటర్ ఆపరేటర్లు తెలిపారు. ఎన్నిసార్లు తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సామూహిక సెలవుల నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు, పంచాయతీ పరిపాలనకు సంబంధించిన అనేక కీలకమైన ఆన్లైన్ పనులు, ప్రజలకు అందించే సేవల్లో కంప్యూటర్ ఆపరేటర్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ జీతాల విషయంలో మాత్రం ఎందుకు ఇంత నిర్లక్ష్యం జరుగుతోందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమములో రాయికల్ మండల ఈ పంచాయతీ ఆపరేటర్లు దిండిగల రమేష్,చిలువేరి ప్రశాంత్ కుమార్,గోనె కృష్ణహరి,దాసరి నరేందర్ పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై రైతుల రాస్తారోకో

### .....కాలిన మోటార్లతో రహదారిపై నిరసన

### ...... 12 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్



రాయికల్ సెప్టెంబర్ 10(అక్షర కలం): రైతులకు ప్రకటించిన విద్యుత్ సరఫరాలో కోతలు విధించడాన్ని నిరసిస్తూ పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు గురువారం రాయికల్ పట్టణంలో ఆందోళనకు దిగారు. పట్టణంలోని విద్యుత్ ఉపకేంద్రం ఎదుట ఉన్న జగిత్యాల--రాయికల్ ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన విద్యుత్ మోటార్లను రహదారిపై ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వ్యవసాయానికి కనీసం 12 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఎప్పుడు నిలిచిపోతుందో, ఎప్పుడు పునరుద్ధరిస్తారో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై సుధీర్‌రావు, విద్యుత్ శాఖ జగిత్యాల రూరల్ ఏడీఈ సింధూర శర్మ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ నెల 20వ తేదీలోగా సమస్యలను పరిష్కరించాలని రైతులు విద్యుత్ అధికారులను కోరారు. అప్పటిలోగా సమస్యలు పరిష్కారం కాకపోతే రహదారిపై వంటావార్పు తదితర కార్యక్రమాలు చేపట్టి ఆందోళనను ఉధృతం చేస్తామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

## అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్ ఇంకా తగ్గలేదా?

### నీలాంటి వ్యక్తిని రెండు సార్లు అసెంబ్లీకి పంపినందుకు ప్రజలు సిగ్గుపడుతున్నరు

**అహంకార తీరు మార్చుకోకపోతే ఎప్పటికీ ఇంట్లోనే కూర్చోవాల్సి వస్తది!**

**పోలీసులకు తక్షణమే క్షమాపణ చెప్పాలి!**

**బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్**

**(అక్షర కలం, నారాయణపేట, సెప్టెంబర్,10)**



నారాయణ పేట జిల్లా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాశీమోహన్ రెడ్డి తీరు మార్చుకోవాలని బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొన్న జరిగిన బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమం లో భాగంగా పోలీసులపై "బట్టలు ఊడదీస్తాం" అంటూ చేసిన అహంకారపూరితమైన దురుసుగా మాట్లాడిన మాటలను ఖండిస్తున్నామన్నా ర. ఒక మాజీ శాసన సభ్యుడు అయివుండి ఇట్లాంటి అహంకారం మాటలు సరికాదన్నారు. చట్టాన్ని గౌరవించని వ్యక్తి ప్రజలకేం చేస్తాడని ప్రశ్నించారు. ఇట్లాంటి వ్యక్తిని అసెంబ్లీకి పంపినందుకు ప్రజలు సిగ్గుపడుతున్నారన్నారు. అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్ లో చట్టాన్ని గౌరవించకుండా పిచ్చి మాటలు,దుసురు మాటలు మాట్లాడితే ప్రజలు ఇక ఇంటికే పరిమితం చేస్తారని,ఇట్లాంటి సంస్కారం లేని,చట్టంపై గౌరవం లేని వ్యక్తులను రాజకీయంగా బుద్ధి చెప్పాలన్నారు. తక్షణమే పోలీసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**గద్వాల టౌన్ అక్షరకలం:**



తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ నాయకులు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల స్వాతంత్ర్య పోరాటం, రజాకార్ల వ్యతిరేక ఉద్యమం, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని భావితరాలకు తెలియజేసేలా సెప్టెంబర్ 17ను అధికారికంగా ఘనంగా నిర్వహించాలని కోరారు. జిల్లా, మండల కేంద్రాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ, స్వాతంత్ర్య సమరయోధుల స్మరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, యువతకు తెలంగాణ విమోచన చరిత్రపై అవగాహన కల్పించేలా వ్యాసరచన, ప్రసంగాలు, ఇతర చారిత్రక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ చరిత్ర, ఉద్యమంలో పాల్గొన్న వారి త్యాగాలను భావితరాలకు తెలియజేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు రవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావ్, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మాలిమ్ ఇసాక్, కౌన్సిలర్ చంద్రశేఖర్, శాలన్న, బీజేపీ సీనియర్ నాయకులు మీర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, పాండు, సద్దల కృష్ణ, ఎర్ర బీమ్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి ఆలయానికి సీసీ కెమెరాలు అందజేత

**గద్వాల టౌన్ అక్షరకలం:**

ఆలయ భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని భావించి 3వ వార్డు హమాలీలోని శ్రీశ్రీశ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయానికి మూడు సీసీ కెమెరాలను శక్తి సెక్యూరిటీ సిస్టమ్స్ అధినేత జె. శ్రీకాంత్ అందజేశారు. ఆలయానికి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన జె. శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ 3వ వార్డు కౌన్సిలర్ నాగులు యాదవ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నాగులు యాదవ్ మాట్లాడుతూ ఆలయ భద్రతను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలు అందించడం అభినందనీయమని అన్నారు. ఆలయంలో జరిగే కార్యక్రమాలను పర్యవేక్షించడంతో పాటు భద్రతకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని



తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ రెడ్డి, టైలర్ శ్రీనివాసులు, వెంకట్రాములు, జనార్ధన్ గౌడ్, పి. వెంకట్రాములు, శంకర్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి న్యూ బస్టాండ్‌లో మదర్ ఫీడింగ్ రూమ్ ప్రారంభం

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

సంగారెడ్డి న్యూ బస్టాండ్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో -- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ రూమ్‌ను ఈరోజు ప్రారంభించారు. ఈ మదర్ ఫీడింగ్ రూమ్‌ను సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ మరియు జిల్లా సంక్షేమ అధికారి కె. లలిత కుమారి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రయాణించే తల్లులు తమ శిశువులకు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణంలో తల్లిపాలు అందించేందుకు మదర్ ఫీడింగ్ రూమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడంతో పాటు, మహిళలు మరియు శిశువుల సంక్షేమానికి ఇటువంటి సౌకర్యాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డిపో మేనేజర్ సుధాకర్ రావు, సీడీపీఓ చంద్రకళ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త గడ్డం పల్లవి, సంగారెడ్డి తహసీల్దార్ జయరాం, అంగన్వాడీ సూపర్వైజర్లు, పి ఓ లింగం, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం తెలుగు దినపత్రిక కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్న సిరిసిల్ల

## ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా సుకాశి యాదగిరి నియామకం..

### నియామక పత్రాన్ని అందజేసిన మండల అధ్యక్షులు రఘుపాల్ రెడ్డి..



**వీణవంక, సెప్టెంబర్ 10 ( అక్షర కలం ):**

వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుకాశి యాదగిరి ని, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ , మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎస్సీ సెల్ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా నియమించారు. వీణవంక మండల కేంద్రంలో గురువారం ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా నియమించబడిన సుకాసి యాదగిరిని, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రఘుపాల్ రెడ్డి, సర్పంచుల పోరం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ లు నియామక పత్రాన్ని అందజేస్తూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం సుకాశి యాదగిరి మాట్లాడుతూ.. నా నియామకానికి సహకరించిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు, హుజురాబాద్ ఇంచార్జ్ ప్రణవ్ బాబు కు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రఘుపాల్ రెడ్డికి, రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కర్ర విజయ భగవాన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీవారికి సేవకు వీణవంక భక్తులు..



**వీణవంక, సెప్టెంబర్ 10 ( అక్షర కలం ):**

వీణవంక మండలంలోని బొంతుపల్లి, చల్లూరు, బేతిగల్ గ్రామాలకు చెందిన 13 మంది శ్రీవారి భక్తులు బొంతుపల్లి సర్పంచ్ బావు సంపత్ టీం లీడర్ ఆధ్వర్యంలో శ్రీవారి సేవకు తిరుపతికి వెళ్లారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు తిరుపతిలోని శిలాతోరణం వద్ద ఫుడ్ సెక్షన్ లో రాత్రి 11 గంటల నుండి తెల్లవారి జామున 5 గంటల వరకు సర్వదర్శనం క్యూ లైన్ లో ఉన్నవారికి గోవింద నామ స్మరణ చేస్తూ పాలు ఉప్మా మంచినీరు అందిస్తూ శ్రీవారి సేవ చేయడం జరిగిందన్నారు. శనివారం ఏకాంత సేవా సమయంలో ఆలయంలో సేవ భాగ్యం కలిగిందని బావు సంపత్ తెలిపారు..

## హుజురాబాద్‌లో 'దికాప్' సినిమా చివరి షెడ్యూల్ పూర్తి



**హుజురాబాద్, సెప్టెంబర్ 10 ( అక్షర కలం ):**

అమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సతీష్ నిమ్మల నిర్మాత గా వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన జి.ఎస్. గౌతమ్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'దికాప్' సినిమా ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ హుజురాబాద్‌లో ఘనంగా జరిగింది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు నిర్వహించిన సినిమాలో ఒక ప్రత్యేక పాట చిత్రీకరణను ప్రముఖ వైద్యుడు, దర్శకుడు డా. జె.పి. శ్రావణ్ కుమార్ క్లాప్ కొట్టి ప్రారంభించారు.. ఈ సందర్భంగా దర్శకుడు గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ.. సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉందని, త్వరలోనే టీజర్‌ను విడుదల చేస్తామని తెలిపారు. చిత్రంలో దీక్షిత్, నవ్య శ్రీనివాస్ హీరో హీరోయిన్లుగా నటిస్తుండగా, సీనియర్ నటుడు సుమన్ ప్రధాన పాత్రలో, జీవా విలన్‌గా అలరించనున్నారు. ఈ కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ చరణ్, కెమెరామెన్ శివ, సంగీత దర్శకుడు అంజి పామిడి, ఎడిటర్ వీరు, అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్, గోపి మరియు అమ్మ ప్రొడక్షన్స్ చిత్ర బృందం పాల్గొంది...

## పిఎంఎఫ్ఎంఈ ప్రోసీడింగ్స్ పంపిణీ

**వీణవంక, సెప్టెంబర్ 10 ( అక్షర కలం ):**

వీణవంక యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్ మరియు జిల్లా డిఆర్డీఓ గీత గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో వివోఓ మీటింగ్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పిఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా వీణవంక మండల కేంద్రానికి చెందిన నీల నాగలక్ష్మి – పున్నం చందర్‌కు రూ. 5,00,000 ల బేకరీ యూనిట్ మంజూరు పత్రం అందించారు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కాసనగోట్టు ఉమ – కరుణాకర్‌కు రూ. 2,00,000 ల పిండిగిర్ని యూనిట్ మంజూరు పత్రం అందించారు గ్రామాల్లో మహిళా సాధికారతే లక్ష్యంగా బేకరీ, పిండి గిర్ని వంటి వ్యాపారాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మహిళలు ఈ యూనిట్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, తోటి సంఘ మహిళలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.






# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ ఎత్తివేసి సభకు అనుమతించాలి

### కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అనర్హత వేటు వేయాలి: తాటికొండ సీతయ్య

**తుంగతుర్తి సెప్టెంబర్ 10 ( అక్షర కలం )**

గత మూడు రోజులుగా జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలను చర్చించకుండా ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య విమర్శించారు. ఎలాంటి కారణం లేకుండా బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేసి ఎమ్మెల్యేలను సభకు అనుమతించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉంటే ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తారనే భయంతోనే వారిని సభకు దూరంగా ఉంచుతున్నారని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, నిషేధిత జాబితా 22-ఏలో అక్రమంగా చేర్చిన భూముల అంశాలను సభలో ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. కేసీఆర్ మరణాన్ని కోరుకుంటున్నట్లు బహిరంగంగా వ్యాఖ్యానించిన షాద్‌నగర్



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసి అనర్హత వేటు వేయాలని సీతయ్య డిమాండ్ చేశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు అక్రమంగా చొచ్చుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు పక్షపాత వైఖరిని విడనాడి అందరికీ సమానంగా చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. అధికార పార్టీకి ఒక చట్టం, ప్రతిపక్షానికి మరో చట్టం ఉండకూడదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని సీతయ్య కోరారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆయన నాయకత్వంలో సాగిన పోరాటం ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్న విషయాన్ని ప్రజలు మరువరని అన్నారు. భవిష్యత్తులో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, మండల నాయకులు గుడిపాటి వీరయ్య, గోపగాని వెంకన్న, తాళ్లపల్లి యాకయ్య, మల్లెపాక రాములు, గడ్డం సోమేశ్, పాలడుగు జలంధర్, బొజ్జ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై ఆధ్వర్యంలోవినాయక నవరాత్రి ఉత్సవాల శాంతి కమిటీ సమావేశం.....

**- ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ కృష్ణమూర్తి....**

**కొల్చారం, సెప్టెంబర్ 10(అక్షర కలం)**

మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలోని బాబా ఫంక్షన్ హాల్ లో స్థానిక ఎస్సై మొయినుద్దీన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శాంతి కమిటీ సమావేశం గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్, రూరల్ సీఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొల్చారం ఎస్సైమొహినుద్దీన్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తుశ్రద్ధలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అనుమతి లేని కార్యక్రమాలకు పాల్పడవద్దని సూచించారు.



అనంతరం రూరల్ సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన మేరకు ప్రతి ఒక్కరూ వినాయక మండపాలలో రాత్రి వేళల్లో ఐదు మంది కమిటీ సభ్యులు మేల్కొని ఉండాల్సిన అవసరం ఉందని షెడ్డు కు సంబంధించి మంచి టాపర్లను కోతులు చించి వేయకుండా చూడాలని విపరీతమైన కోతులు పెరగడంతో కోతులు షెడ్లోకి వెళ్లి వినాయక ధ్వంసం కావచ్చు లడ్డు ఎత్తుకెళ్లడం కావచ్చు పలు సంఘటన జరిగే అవకాశాలు ఉన్నాయని వీటివల్ల అనవసరమైన లేనిపోని గిట్టని వారు కావాలనే చేశారని ఉద్దేశాలు వస్తాయని ఈ విషయాలన్నీ జాగ్రత్తగా పాటించి ప్రజలకు పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ డీజే లకు ఎలాంటి అనుమతులు లేవని ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టినటువంటి" ఆగమన్" అమల్లో ఉంటుందని డీజే లు పెట్టడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు, వృద్ధులు మృత్యుభారిన పడే అవకాశాలు ఉన్నాయని మామూలు సౌండ్ బాక్స్ లో వినియోగించాలని లేని ఏడల చట్ట రీత్యా చర్యలుతీసుకోబడతాయని తెలియజేశారు. అలాగే రాత్రి వేళల్లో స్థానిక పోలీసులు కాకుండా ప్రత్యేక టీములు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడతారని వినాయక మండపాల వద్ద ఎలాంటి అనుమతులు లేని కార్యక్రమాల పాలు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్పి ప్రసన్న కుమార్, రూరల్ సిఐ కృష్ణమూర్తి లను కాలువాలతో స్థానిక సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి ఆయా గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులు వార్డు సభ్యులు కలిసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు యువజన సంఘాల వారు పలు పార్టీల ప్రజాప్రతినిధులు సిబ్బంది మహేష్ ,రాజు ,ఏఎస్ఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాచారం ఇచ్చిన వెంటనేశాంతి కమిటీ సమావేశానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన యువతకు ప్రజాప్రతి నిధులకు పోలీస్ శాఖ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కల్పించాలి

**కార్మికులపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని**

**సిఐటియు అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్**

**అక్షర కలం, అందోలు ప్రతినిధి:**

అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కల్పించాలని, కార్మికులపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని సీఐటియు అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యసాగర్ అన్నారు. గురువారం జోగిపేట ఏరియా ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు.



అనంతరం హాస్పిటల్ సూపరెంట్ సౌజన్యకు వినతి పత్రం అందజేశారు. ఈ ఆయన సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కాంట్రాక్టు పద్ధతిన దాదాపు 48 మంది కార్మికులు పనిచేస్తున్నారని, రాత్రి పగలు అనే తేడా లేకుండా 24 గంటలు పని చేస్తున్న కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కొందరు కార్మికులపై దుర్భాషలాడుతూ దాడులకు పాల్పడుతున్నారని, మహిళలు అని కూడా చూడకుండా అసభ్యకరంగా దాడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని గుర్తించి వెంటనే కఠినంగా శిక్షించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, రక్షణ కల్పించాలని విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ప్రభాకర్, మల్లేశం, భీంరావు, శ్రవణ్, హరి కృష్ణ, జయమ్మ, పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి .. సర్పంచ్ కలకోట్ల మల్లేష్

**తుంగతుర్తి సెప్టెంబర్ 10 (అక్షర కలం)**

తుంగతుర్తి; ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కలకోట్ల మల్లేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పేద మధ్య తరగతి ప్రజలకు నిత్యవసర సరుకులు అందించే పౌరాసరఫర శాఖలో పారదర్శకతను పెంచే ప్రయత్నం చేస్తుందన్నారు. రేషన్ కార్డు పొందడమేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఇది గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందన్నారు.



ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామానికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాల అందుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు ,సన్న బియ్యం, వంటి పథకాలను పేదలకు అందిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, డీలర్ విజయ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం : సర్పంచ్ చిలుకల మంజుల, వైస్ మార్కెట్ చేర్మెన్ చింతకుంట వెంకన్న..

**తుంగతుర్తి సెప్టెంబర్ 20 (అక్షర కలం)**

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం



వీరోచితంగా పోరాడి, తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన నిప్పుకణిక, మహిళాలోకానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని సర్పంచ్ చిలుకల మంజుల కొనియాడారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం గ్రామపంచాయతీ ఆవరణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ, పోరాట పటిమ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు...మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు....ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అన్నబోయిన శ్రీకాంత్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిలకల వెంకన్న, రజక సంఘం నాయకులుదూది గాని వెంకటయ్య, వీరయ్య, ఎల్లేష్, పాలకవర్గ సభ్యు లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యూఐ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా కొండగడుపుల ప్రవీణ్ కుమార్

**తుంగతుర్తి సెప్టెంబర్ 10 (అక్షర కలం)**

సూర్యాపేట జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండగడుపుల ప్రవీణ్ కుమార్ ను నియమించారు. ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జకర్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ స్వామి ఈ నియామకం చేపట్టారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ప్రవీణ్ కుమార్ గురువారం సాయంత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కొండగడుపుల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎల్లవేళలా విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థుల హక్కులు, సమస్యలపై పోరాడుతూ వారికి అండగా నిలుస్తానన్నారు. పార్టీ నాయకుల సహకారంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా అవకాశం కల్పించేందుకు కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, నల్గొండ




పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీరా రెడ్డి , భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి, సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధకిషన్ రావు ,ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాఖర్,ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు యాదవెల్లి వెంకటస్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు

## ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నిల్వల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10: జిల్లాలోని అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నిల్వల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)



వి రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఎసిఎస్ఓ లతో కలిసి ఇన్‌చార్జీలు, డిఈఓలు, స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వి రాములు మాట్లాడుతూ, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఉన్న నిల్వల పంపిణీ ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత ఇన్‌చార్జీలను ఆదేశించారు. స్టాక్ తరలింపులో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులు అవసరానికి అనుగుణంగా తగినన్ని వాహనాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకుని, అందుబాటులో ఉన్న నిల్వలను సకాలంలో తరలించాలని ఆదేశించారు. నిల్వల తరలింపు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం... జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10:**

సామాజిక అన్యాయాలు, దోపిడీ, అణచివేతను ఎదురించి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, వెనుకబడిన తరగతుల శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, పేద, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పట్టుదల నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. వెట్టి చాకిరీ, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి మహిళా చైతన్యానికి, సామాజిక న్యాయానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.



అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణేశ్ విగ్రహాలను పంపిణీ చేసి మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా జలవనరుల కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. రసాయనిక రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955